andhrajyothy.com


ఆంధ్రజ్యోతి

శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 39.7 | కనిష్ఠం 19.4

కామారెడ్డి
జిల్లా వార్తలు

5

ఆదివారం 6 ఏప్రిల్ 2025



ఇందిరమ్మ ఇళ్లకు అడుగులు



అచ్చయిపల్లిలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇల్లు

- జిల్లాలో మొదలైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు
- పైలెట్‌గా 22 పంచాయతీల్లో నమూనా ఇళ్లు
- మొదటి విడత కింద 2,396 ఇళ్ల మంజూరు
- ఇందులో ఇప్పటికే పునాదులు, బేస్మెట్ స్థాయిలో 262 ఇళ్లు
- మిగిలా ప్రాంతాల్లో ఎల్-1 జాబితా పునఃపరిశీలన
- దశల వారీగా త్వరలోనే ఇళ్ల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్

కామారెడ్డి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకం పటిష్ఠంగా అమలు చేసేలా అడుగులు పడుతున్నాయి. గత జనవరి 26న గ్రామసభలు నిర్వహించి 22 గ్రామ పంచాయతీల్లో పలువురికి ఇళ్లు మంజూరు చేశారు. అందులో కొన్ని బేస్మెట్ స్థాయికి చేరగా మిగిలిన పంచాయతీల్లో లబ్ధిదారుల ఎంపికపై కసరత్తు జరుగుతోంది. మరోవైపు కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ మున్సిపాలిటీల్లో ఎల్-1 జాబితాలో రీ వెరిఫికేషన్ కొనసాగుతోంది. ఇందులో అర్హులను గుర్తించి కలెక్టర్‌కు పంపించగా ఎంపిక పూర్తి చేయనున్నారు. మొదటి విడత కింద జిల్లా వ్యాప్తంగా 2,396 ఇళ్లు మంజూరు కాగా ఇందులో అనుమతి లభించిన ఇళ్లకు నిర్మాణాలు చేపడుతున్నారు. హౌసింగ్ కార్పొరేషన్ అధికారులు ఇచ్చిన నమూనా ప్రకారం నిర్మాణాలు కొనసాగుతున్నాయి. నాలుగు విడతల్లో ఇళ్ల నిర్మాణాలకు రూ.5 లక్షలను ప్రభుత్వం అందజేయనుంది.

ఇందిరమ్మ ఇళ్లకు 2.45 లక్షల దరఖాస్తులు

అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో ఆ ప్రభుత్వ హయాంలో విజయవంతంగా అమలు చేసిన ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని తిరిగి పునరుద్ధరించింది. ఏడాది కిందట ప్రజాపాలన గ్రామసభల్లో అర్హులైన వారి నుంచి ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు స్వీకరించారు. ఇలా జిల్లా వ్యాప్తంగా మొత్తం 2,45,541 ఇందిరమ్మ ఇళ్ల కోసమై దరఖాస్తులు వచ్చాయి. కాగా ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గృహ నిర్మాణ శాఖకు ఇందిరమ్మ ఇళ్ల అమలు బాధ్యతను అప్పగించి ఇది వరకే సర్వే చేయించిన విషయం తెలిసిందే. జిల్లాలో నియోజకవర్గానికి 3,500ల ఇళ్ల చొప్పున ప్రభుత్వం మొదటి విడత కింద మంజూరు చేసింది. ఈ లెక్కన కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్, బాన్సువాడ నియోజకవర్గాల్లో మొత్తం 14వేల వరకు ఇళ్లు వచ్చే అవకాశం ఉంది. స్థలం ఉన్న వారికి ఇంటి నిర్మాణం కోసం రూ.5లక్షలు విడతల వారీగా ప్రభుత్వం మంజూరు చేయనుంది.

1,672 ఇళ్ల నిర్మాణానికి ఆమోదం

రాష్ట్ర ప్రభుత్వం నాలుగు సంక్షేమ పథకాలను ఈ ఏడాది జనవరి 26న ప్రారంభించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా అదేరోజు గ్రామసభల్లో లబ్ధిదారుల జాబితాను ప్రకటించారు. జిల్లాలోని 22 గ్రామ పంచాయతీలకు సంబంధించి ఎంపీడీవోలు 2,396 మందిని ఇందిరమ్మ ఇళ్లకు అర్హులుగా తేల్చగా అందులో 1,672 దరఖాస్తులకు కలెక్టర్ ౨. ఇందులో 262 ఇళ్లకు జియో ట్యాగింగ్ పూర్తి చేయగా ఇళ్ల నిర్మాణం కోసం ముగ్గు పోశారు. సుమారు 110 ఇళ్ల నిర్మాణాలు పునాది దశలో ఉన్నాయి. మరికొన్ని దరఖాస్తులను ఎంపీడీవోలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంది.

మోడల్ హౌస్‌ల నిర్మాణం

ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం అవగాహన కల్పించేలా మోడల్ హౌస్ నిర్మాణాన్ని చేపట్టింది. ప్రభుత్వం మంజూరు చేసే రూ.5లక్షలతో ఇంటి నిర్మాణం ఎలా చేపట్టవచ్చో తెలియజేయడమే వీటి లక్ష్యం. ఆ ౦౦ ౨ నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు మోడల్ ఇళ్ల నిర్మాణానికి ముగ్గు పోసి ప్రారంభించారు. ఇక్కడ 400ల చదరపు అడుగుల స్థలంలో హాల్, కిచెన్, అటాచ్ బాత్‌రూంతో ఇళ్లు నిర్మించనున్నారు. ఇంటి లోపల గదులు, వరండాలో టైల్స్ వేయడమే కాక డాబా మెట్ల కింద టాయిలెట్స్ నిర్మించనున్నారు. ఇంట్లో విద్యుత్ సౌకర్యం కల్పించడంతో పాటు ఫ్యాన్ లు, ఇంటికి రంగులు అన్నింటిని రూ.5లక్షలలోపే పూర్తి చేయనున్నారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 లక్షలు ఇవ్వనున్నందున విడతల వారీగా లబ్ధిదారుల ఖాతాలో జమ చేయనుంది. మొదటి విడత కింద బేస్మెట్ లెవల్‌లో రూ.1లక్ష, రెండో విడత కింద గోడల నిర్మాణం చేపట్టిన తర్వాత రూ.1లక్ష, మూడో విడతలో స్లాబ్ పూర్తయ్యాక రూ.2లక్షలు, నాలుగో విడతలో ప్లాస్టరింగ్, రంగులకు రూ.1లక్ష ప్రభుత్వం ఇవ్వనుంది.

మూడు కేటగిరీలుగా ఇళ్లు

నిరుపేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు దరఖాస్తు దారులను మూడు కేటగిరీలుగా విభజించారు. సొంత స్థలం ఉండి నిర్మాణానికి దరఖాస్తు చేసుకున్న వారిని ఎల్ 1 కింద విభజించారు. వారు చూపిన స్థలాన్ని జియో ఫెన్సిం గ్ చేశారు. సొంత భూమి లేని వారిని ఎల్ 2 జాబితాలో చేర్చారు. వారికి స్థలంతో పాటు నిర్మాణానికి రూ.5లక్షలు కేటాయిస్తారు. అద్దెకు ఉన్నవారు, సొంత ఇల్లు ఉండి ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్న వారిని ఎల్ 3 జాబితాలో చేర్చారు. ఇలా జిల్లాలో ఎల్ 1 జాబితాలో 1,03,176 దరఖాస్తుదారులు ఉండగా ఎల్ 2 జాబితాలో 52,109, ఎల్ 3 జాబితాలో 80,045 దరఖాస్తులు ఉన్నాయి.



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్

జగ్జీవన్ చిత్రపటం వద్ద నివాళ్లు అర్పిస్తున్న కలెక్టర్

జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు కృషి చేయాలి

- కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఆయన జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో చిన్నారులు చేసిన నృత్యాలు అందరిని అలరించాయి. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ క్విట్ ఇండియా పోరాటం, గ్రీన్ రెవల్యూషన్ వంటి పోరాటాల్లో పాల్గొన్నారని తెలిపారు. సమాచార, రైల్వే, రవాణా, కమ్యూనికేషన్‌శాఖల మంత్రిగా చేశారని తెలిపారు. గ్రీన్ రెవెల్యూషన్‌లో భాగంగా హరిత విప్లవానికి నాంది పలికారని తెలిపారు. అదేవిధంగా ఈనెల 14లోగా ఆన్‌లైన్‌లో రాజీవ్ యువ వికాసంకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. గత నాలుగు నెలల క్రితం ప్రభుత్వం వసతి గృహాల మెను 40 శాతం పెంచిందని తద్వారా మంచి భోజనం విద్యార్థులకు అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రతీ ఇనిస్టిట్యూట్‌కు ఒక అధికారిణి నియమించడం జరిగిందన్నారు. విద్యార్థులకు అందుతున్న భోజనం, వసతి సౌకర్యాలను పరిశీలించి నివేదికలు సమర్పించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం జరుగుతుందని, జిల్లాలో 60 శాతం పంపిణీ జరిగిందని తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి మాట్లాడుతూ బాబు జగ్జీవన్‌రామ్ ఎంపీగా, ఉప ప్రధానిగా పని చేశారన్నారు. రాజకీయంగా ఉన్నతంగా వ్యవహరించిన వ్యక్తి అని అన్నారు. జిల్లాలో శాఖ గ్రంథాలయాలు అందుబాటులో ఉన్నాయని యువత వాటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ఎస్సీ వర్గీకరణ చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చందర్‌నాయక్, ఎస్సీ సంక్షేమ అధికారిణి రజిత, ఆర్‌డీవో వీణ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, డీఆర్‌డీవో పీడీ సురేందర్ తదితరులు పాల్గొన్నారు.



నృత్యాలు చేస్తున్న చిన్నారులు



మాట్లాడుతున్న అనిల్‌కుమార్

డీఏలు, పీఆర్‌సీలను వెంటనే ప్రకటించాలి

- టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, డీఏలు, పీఆర్‌సీలను వెంటనే ప్రకటించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని వశిష్ట డిగ్రీ కళాశాలలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు బకాయిపడిన నాలుగు వాయిదాల డీఏను, జూలై 2023 నుంచి అమలు చేయాల్సిన పీఆర్‌సీని అడగొద్దని అవికావాలంటే నెలనెల జీతాలే ఇవ్వలేమని సీఎం ప్రకటించడానికి ఖండిస్తున్నామని అన్నారు. ఉద్యోగులు గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదని వారికి న్యాయంగా రావాల్సిన బకాయిలను లేదా వారు దాచుకున్న సొమ్మును వారికి తిరిగి చెల్లించాలని మాత్రమే అడుగుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు నాగభూషణం, ఉపాధ్యాక్షురాలు నలినిదేవి, జిల్లా కార్యదర్శి లక్ష్మీ, నరేందర్, ప్రకాష్, శ్రీనివాస్, నారాయణ, సునీల్ తదితరులు పాల్గొన్నారు.



సీతారాముల కల్యాణం చూతము రారండి

- నేడు శ్రీరామ నవమి
- జిల్లాలో ముస్తాబైన రామాలయాలు



కామారెడ్డిలో వేడుకలకు ఆలయాలను సిద్ధం చేస్తున్న భక్తులు

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): చైత్ర వసంతంలో కమనీయమైనది సీతారాముల కల్యాణ మహోత్సవం. ఇంటింటా, వాడవాడలా చలువ పందిల్లు పచ్చని మామిడి తోరాణలతో ప్రతీ చోట శ్రీరామస్మరణతో కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరుగుతోంది. ఈ కల్యాణంలో చిన్న, పెద్దలు తారతమ్యం లేకుండా అందరు పాల్గొంటారు. చైత్రశుద్ధ ప్రతిపాద నుంచి ప్రారంభమై శ్రీరామ నవరాత్రులు కల్యాణం పట్టాభిషేకంతో ముగుస్తాయి. శ్రీరామనవమి ఉత్సవాలు, సీతారాములు కల్యాణ మహోత్స ఉత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా జరుగనున్నాయి. శ్రీరా వ ౦ న వ మి

పెద్ద ఎత్తున తిలకించాలని ఆయా ఉత్సవ కమిటీల ప్రతినిధులు తెలిపారు. అడ్లూర్ సీతారామా చంద్ర స్వామి, చిన్న మల్లారెడ్డిలోని సీతారామ లక్ష్మణ ఆలయం ముస్తాబు చేశారు. ఈ ఉత్సవాలకు ప్రజలు ఉత్సవాలకు పట్టణంలోని ఆయా ఆలయాలు ముస్తాబయ్యాయి. రాంమందిర్, శ్రీరాంనగర్ కాలనీ, అశోక్‌నగర్ కాలనీ, ఎన్జీవోస్, వివేకానంద కాలనీ, హౌజింగ్ బోర్డు కాలనీల్లోని ఆయా శ్రీ సీతారామాంజనేయస్వామి ఆలయాలు ఉత్సవాల కోసం పందిళ్లు, రంగులతో అందంగా ముస్తాబయ్యాయి. పట్టణంలో శ్రీరామ కల్యాణోత్సవానికి భక్తులు తరలివచ్చి కల్యాణోత్సవాన్ని పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారి దీవెనలు పొందాలని వారు కోరారు.

ఎల్లారెడ్డిలో..

ఎల్లారెడ్డి: నేడు శ్రీరామనవమి సందర్భంగా ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో ఉన్న రామాలయాన్ని ఆలయ ధర్మకర్తలు సిద్ధి వారి పరివార్ వారు ఏర్పాట్లు చేశారు. ఆలయానికి వివిధ రంగులతో అలంకరించి శ్రీరామనవమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేశారు. సోమవారం ఎడ్లబండ్ల ప్రదర్శన, బుధవారం శ్రీకృష్ణుని కల్యాణం, శుక్రవారం రాత్రి రథోత్సవం ఉంటుందని భక్తులు గమనించాలని తెలిపారు.



ఎల్లారెడ్డిలో శ్రీరామ నవమికి ముస్తాబైన రామాలయం

ఎల్లారెడ్డిలో పారిశుధ్య పనుల నిర్వహణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మండలంలోని వెల్లుట్లపేట, ఆజామాబాద్ గ్రామాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉండడంతో 'ఆంధ్రజ్యోతి' దిన పత్రికలో శనివారం 'ప్రత్యేక పాలన అస్తవ్యస్తం' అనే కథనానికి ప్రత్యేక అధికారులు స్పందించారు. వెల్లుట్లపేటలో మురికి కాలువలను శుభ్రం చేయించి వృథాగా పోతున్న తాగునీటి పైప్‌లైన్‌కు ప్రత్యేక అధికారి వాసంతి మరమ్మతులు చేయించారు. ఆజామాబాద్ గ్రామంలో రోడ్డుపై ఉన్న చెత్త పంచాయతీ సిబ్బంది తొలగించి శుభ్రం చేశారు. దీంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.



వెల్లుట్లపేటలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి వాసంతి

భక్తుల కొంగు బంగారం
శబరిమాత ఆశ్రమం

- నేటితో శబరిమాత జీవ సమాధికి 25 ఏళ్లు
- తాడ్వాయి శబరిమాత ఆశ్రమానికి ఘనమైన చరిత్ర
- దినదిన అభివృద్ధి చెందుతున్న ఆశ్రమం

7



ఎర్రటి ఎండలో ఉపాధి హామీ పనులు

- పని ప్రదేశాల్లో కానరాని వసతులు
- ఇబ్బంది పడుతున్న కూలీలు
- ఎండకు తట్టుకోలేక తగ్గిన కూలీల సంఖ్య
- సౌకర్యాలు కల్పించాలని కూలీల ఆవేదన

7



సదవకాశం

- మున్సిపల్‌లో ముందస్తు ఆస్తిపన్ను చెల్లిస్తే 5 శాతం మినహాయింపు
- ఆఫర్ ప్రకటించిన మున్సిపల్ శాఖ
- ఆన్‌లైన్‌లోనూ చెల్లించే అవకాశం
- ఈ నెల 30 వరకు గడువు

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీల్లో ఆస్తిపన్ను వసూళ్లు చేసి మున్సిపల్ అభివృద్ధికి ఆ నిధులను వినియోగించేందుకు ప్రభుత్వం అన్ని రకాల ఆలోచనలు చేస్తోంది. అందులో భాగంగానే నివాస గృహాలు, వాణిజ్య సముదాయ భవనాలకు సంబంధించి 2025-26 ఆర్థిక సంవత్సరం ఆస్తి పన్ను ముందస్తుగా చెల్లించే వారికి 5 శాతం మినహాయింపు ఇస్తున్నట్లు రాష్ట్ర మున్సిపల్‌శాఖ ప్రకటించింది. మున్సిపాలిటీల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే నిధులతో పాటు పన్నుల వసూళ్లతో వచ్చే నిధులు వినియోగిస్తారు. దీంతో పన్ను వసూళ్లపై మున్సిపల్ అధికార యంత్రాంగం దృష్టి సారించింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి పన్ను వసూళ్లలో జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ మున్సిపాలిటీలు పోటిపడి మరి రాత్రి సమయం వరకు మున్సిపల్ కార్యాలయంలోనే సమయం వెచ్చించి పన్ను వసూళ్లకు చేరువయ్యారు. ఈ ఏడాది కూడా ప్రభుత్వం విధించిన లక్ష్యాన్ని చేరుకునేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు ప్రారంభించారు. అయితే ప్రభుత్వం ప్రకటించిన 5 శాతం మినహాయింపు ఏప్రిల్ 30 వరకు మాత్రమే ఉందని ప్రజలు వినియోగించుకోవాలని కోరుతున్నారు.

డిజిటల్ పేకు శ్రీకారం

ప్రస్తుతం సమాజంలో డిజిటల్ పేకే ప్రజలు ఎక్కువగా మొగ్గు చూపుతుండడంతో ప్రభుత్వం సైతం డిజిటల్ పే వైపు అడుగులు వేస్తోంది. ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ-సేవలు ప్రారంభించిన ప్రభుత్వం పన్నులను సైతం డిజిటల్ మార్గంలోనే వసూళ్లు చేయాలని ఆలోచన చేస్తోంది. అందులో భాగంగానే డిజిటల్ పేతో పన్ను వసూలు చేసేందుకు మున్సిపల్ అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. స్మార్ట్‌ఫోన్లలో క్యూఆర్ కోడ్ స్కాన్, ఏటీఎం, డెబిట్, క్రెడిట్ కార్డులు, ఇంటర్‌నెట్ బ్యాంకింగ్, యూపీఐ, గూగుల్‌పే, ఫోన్‌పై ద్వారా నేరుగా ఆ మున్సిపాలిటీల ఖాతాలోకి జమ అవుతోంది. సీడీఎంఏలో సర్చ్ చేస్తే జిల్లా పేరు వస్తోంది. అనంతరం మున్సిపాలిటీని ఎంపిక చేసుకుని ఇంటి నెంబర్ టైప్ చేస్తే ఆస్తిపన్ను ఎంత చెల్లించాలనేది వస్తోంది. ఆ తర్వాత నగదును చెల్లిస్తే నేరుగా మున్సిపల్ ఖాతాలో జమవుతోంది. దీంతో అధికారులకు, వినియోగదారులకు సమయం ఆదా కావడమేగాక నిర్ణీత గడువులోగా పన్ను చెల్లించే వీలు కలుగుతుందని ఈ పద్ధతికి ప్రభుత్వం మొగ్గ చూపిందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.



పన్ను వసూళ్లు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది (ఫైల్)

ఈనెల చివరి వరకే అవకాశం

ప్రతీ సంవత్సరం ఆస్తిపన్ను వసూలు అనుకున్న మేర జరగడం లేదని గ్రహించిన మున్సిపల్‌శాఖ గత కొన్ని సంవత్సరాల నుంచి సరికొత్త ఆలోచనలకు తెరలేపి అనుకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకు ప్రణాళికలు తయారు చేస్తోంది. అందులో భాగంగానే గత ఆర్థిక సంవత్సరంలో వడ్డీ రాయితీ ప్రకటించి పన్ను వసూళ్లకు చేరువయింది. ప్రస్తుతం 5 శాతం మినహాయింపు అవకాశంను మళ్లీ తెరమీదకు తీసుకువచ్చింది. అయితే ఈ మినహాయింపు అవకాశం ఈ నెల చివరి వరకు మాత్రమే ఉంటుందని మున్సిపల్ అధికారులు పేర్కొంటున్నారు. రూ.1 లక్ష చెల్లింపులు జరిపిన వారికి రూ.95 వేలను, రూ. 1000 ఉంటే రూ.950, రూ.500 ఉంటే రూ.475 చెల్లించవచ్చు. ఇలా ప్రతీ ఇంటి, వాణిజ్య సముదాయానికి చెందిన పన్ను మొత్తంలో 5 శాతం రిబేట్ ఉంటుందని పేర్కొంటున్నారు.

ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- రాజేందర్, మున్సిపల్ కమిషనర్, కామారెడ్డి

పన్ను వసూళ్లకు ప్రభుత్వం ప్రకటించిన 5 శాతం రిబేట్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. గత ఆర్థిక సంవత్సరం మాదిరిగా ఈ సంవత్సరం కూడా పన్ను వసూళ్ల లక్ష్యానికి అన్ని రకాలుగా కృషి చేస్తాం. డిజిటల్‌పే ద్వారా మున్సిపాలిటీలోని వివిధ సేవలకు సంబంధించిన పన్నులు చెల్లించవచ్చు. నిర్ణీత గడువులోగా పన్నులు చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి ప్రజలు సహకరించాలి.

బాధిత కుటుంబానికి మాజీ మంత్రి పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మండవ

బోధన్‌రూరల్,ఏప్రిల్5(ఆంధ్రజ్యోతి): మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ సునీతా దేశాయ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటేశ్వర్ రావు దేశాయ్ కుటుంబాన్ని శనివారం మాజీమంత్రి మండవ వెంకటేశ్వర్ రావు పరామర్శించారు. ఇటీవల వారి పెద్ద కుమారుడు ప్రీతమ్ దేశాయ్ గుండెపోటుతో మృతి చెందారు. శనివారం ఆయన వెంకటేశ్వర్ రావు దేశాయ్ కుటుంబాన్ని పరామర్శించారు. ప్రీతమ్ దేశాయ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రీతమ్ దేశాయ్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు

ప్రభుత్వ నిబంధనల మేరకే ఇసుక రవాణా



అక్రమ ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్న సబ్ కలెక్టర్

బోధన్‌రూరల్: ప్రభుత్వ నిబంధనల మేరకే ఇసుక రవాణా చేయాలని, అక్రమ ఇసుక రవాణా చేస్తే వాహనాలు సీజ్ చేయబడతాయని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. శుక్రవారం రాత్రి బోధన్ మండలంలోని మంజీర సరిహద్దు ప్రాంతాలలో ఆయన ఆకస్మికంగా పర్యటించారు. మంజీర సరిహద్దు ప్రాంతం మందర్నా నుండి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. వేబిల్లు పర్మిషన్ వంటి పత్రాలు అడగడంతో డ్రైవర్ ఎలాంటి పత్రాలు చూపకపోవడంతో ఆగ్రహించిన సబ్ కలెక్టర్ వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నియమ, నిబంధనల మేరకే ఇసుకను రవాణా చేయాలని, నిబంధనలను అతిక్రమించి అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వరి కోత ప్రయోగం పరిశీలన



ఏరాజ్‌పల్లిలో వరికోత ప్రయోగాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

బోధన్‌రూరల్,ఏప్రిల్5(ఆంధ్రజ్యోతి): బోధన్ మండలంలోని ఏ రాజ్‌పల్లి గ్రామంలో శనివారం వరిపంట కోత ప్రయోగాన్ని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో పరిశీలించారు. వరిపంట కోత ప్రయోగం యొక్క ప్రాముఖ్యతను ఏఏ రంగాలలో ఈ ప్రయోగం ద్వారా వచ్చిన దిగుబడిని ఉపయోగిస్తారో డివిజన్ ఉప గణాంకాల అధికారి లక్ష్మారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట అశోక్ కుమార్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నేడు రహత్ నగర్‌కు పీసీసీ అధ్యక్షుడి రాక

ఆర్మూర్ రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి):భీంగల్ మండలం రహత్‌నగర్‌కు ఆదివారం పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్ రానున్నారు. గ్రామంలోని లొద్దిరామన్న ఆలయంలో శ్రీరామ నవమి సందర్భంగా జరిగే రాములవారి కల్యాణోత్సవంలో పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ కుటుంబ సమేతంగా పాల్గొననున్నారు. 1969లో మహేష్ కుమార్ గౌడ్ తండ్రి బొమ్మ గంగాధర్‌గౌడ్ ఆలయాన్ని నిర్మించారు.లొద్ది రామాలయం అంటే వారికి ఎంతో నమ్మకం.పీసీసీ అధ్యక్షులుగా నియమితులైన తర్వాత గ్రామాభివృద్ధి కమిటీ ఆహ్వానం మేరకు మొదటి సారిగా లొద్ది రామన్న కల్యాణోత్సవంలో ఆలయన పాల్గొననున్నారు.

సుదర్శన్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలి

●బాల్కొండ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్

మోర్తాడ్ ,ఏప్రిల్5,(ఆంధ్రజ్యోతి):జిల్లాలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బోధన్‌ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి మంత్రి వర్గం విస్తరణలో అవకాశం ఇచ్చి మంత్రి పదవి ఇవ్వాలని బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ తరపున అదిష్టా నానికి విన్నవిస్తున్నట్లు బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ అన్నారు. శనివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో నర్సయ్య, రాములు, సుంకెట రవి, తీగెల తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుడిపై దాడి

● దాడికి పాల్పడ్డ ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు

బోధన్‌రూరల్,ఏప్రిల్5(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని రాకాసిపేటలో ఆర్డీవో కార్యాలయం వెనుక కాలనీలో చెత్త సేకరణ విషయమై మున్సిపల్ కార్మికుడిపై దాడి చేసిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు బోధన్ పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం చెత్త సేకరణకు మున్సిపల్ కార్మికుడు అశోక్ కుమార్‌ను అదే కాలనీకి చెందిన మహ్మద్ సలీం, ఇమ్రాన్, షేక్ హైమద్‌లు కలిసి డ్రైవర్ అశోక్‌ను చెత్త తీసుకెళ్లడానికి రోజు రావడం లేదని బూతులు తిట్టి చేతులతో కొట్టారని, చంపి వేస్తానని బెదిరించారని మున్సిపల్ కార్మికుడు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. మున్సిపల్ కార్మికుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అతనిపై దాడికి పాల్పడ్డ ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు.

కోటగిరిలో 8న విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

కోటగిరి,ఏప్రిల్5(ఆంధ్రజ్యోతి): కోటగిరి మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఈ నెల 8వ తేదీన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార కేంద్రం నిర్వహిస్తున్నట్లు కోటగిరి ట్రాన్స్‌కో ఏఈ బుజ్జిబాబు తెలిపారు. కోటగిరి, రుద్రూరు, పొతంగల్, వర్ని, చందూర్ సెక్షన్ల పరిధిలోని వినియోగదారులు తమ ఫిర్యాదులను రాతపూర్వకంగా అందించాలన్నారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

నవీపేట,ఏప్రిల్5(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు సరిన్, తదితరులున్నారు.

చోరీలు చేస్తున్న వ్యక్తి అరెస్టు

ఖిల్లా, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలవాటుపడి దొంగతనాలు చేస్తున్న వ్యక్తిని మాక్లూర్ పోలీసులు అరెస్టు చేసినట్లు నిజామాబాద్ ఏసీపీ రాజావెంకటరెడ్డి తెలిపారు. వివరాలను ఆయన ఛాంబర్‌లో వెల్లడించారు. మాదాపూర్ గ్రామానికి చెందిన పరుశు దేవానందం ఇంట్లో దొంగతనం జరిగిన విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు దర్యాప్తులో భాగంగా మాదాపూర్ గ్రామంలోని సీసీ పు టేజీ, ఇతర ఆధారాలను బట్టి దొంగతనం చేసిన వ్యక్తి కోసం గాలిస్తుండగా మానిక్ భండార్ చెక్క వద్ద అనుమానాస్పదంగా ఉన్న నాందేవ్‌ను అదుపులోకి తీసుకొని వి చారణ చేసినట్లు తెలిపారు. నేరం అంగీకరించడంతో ఆయన వద్ద నుంచి 65 గ్రాముల బంగారం, వెల్మల్ గ్రామంలో చేసిన దొంగతనంలో 26 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకొని కేసునమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ కేసును నార్త్ రూరల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, మాక్లూర్ ఎస్సై రాజశేఖర్, సిబ్బంది కేసును చేదించినట్లు తెలిపారు.



వేల్పూర్‌లో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే వేముల



చందూర్‌లో విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పోచారం



ఆర్మూర్‌లో జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఏసీపీ

ఘనంగా బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు

వేల్పూర్, ఏప్రిల్ 5,(ఆంధ్రజ్యోతి): బాబు జగ్జీవన్ రామ్ ఆశయ సాధన కోసం అన్ని వర్గాల వారు ఏకమై పాటు పడాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి అన్నారు. శనివారం వేల్పూర్‌లో బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలలో పాల్గొని జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కుల రహిత వర్గాల కోసం పాటుపడిన బడుగు, బలహీన వర్గాల నేత, సామాజిక సమానత్వం కోసం పోరాడిన ఆదర్శ నేత దేశ మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ అని అన్నారు. అంబేద్కర్ బడుగు బలహీన వర్గాల కోసం రాజ్యాంగం రచిస్తే ఆ రాజ్యాంగ ఫలాలు అందడానికి అవి అమలు అయ్యే విధంగా కృషి చేసిన గొప్ప వ్యక్తి జగ్జీవన్‌రామ్ అని అన్నారు. తన జీవిత కాలం మొత్తం అనగారిని వర్గాల కోసం కృషి చేశాడన్నారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, దళిత సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కోటగిరి: మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రావ్ భావితరాలకు ఆదర్శ ప్రాయుడని కోటగిరి మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతు పేర్కొన్నారు. కోటగిరి మండల కేంద్రంలోని హరిజన వాడ కాలనీలో శనివారం బాబు జగ్జీవన్ రావ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. బాబు జగ్జీవన్ రామ్ 50ఏళ్ల పాటు సుదీర్ఘ రాజకీయాల్లో కొనసాగి మచ్చలేని నాయకుడిగా కొనసాగారని కొనియాడారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన ఎంతగానో కృషి చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు శ్రీకాంత్, నాయకులు మనోహర్, బర్ల మధుకర్, గంగాధర్ రావు దేశాయ్, భీమ సాయిరెడ్డి, దావులయ్య, ఆర్టీసీ సాయిలు, దినేష్, గంగారాం, లాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ రూరల్: ఆర్మూర్ మండలం గోవింద్‌పేటలో శనివారం బాబు జగ్జీవన్‌రాం జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మెన్ బంటు మహిపాల్, మాజీ ఎంపిటీసీ స భ్యులు రాజ్‌కుమార్, మాజీ సర్పంచ్ బండమీది గంగాధర్, పంచాయతీ కార్యదర్శి సుకన్య, గ్రామస్తులు తదితర లు ఉన్నారు.

బోధన్‌రూరల్: బోధన్ పట్టణంలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బాబు జగ్జీవన్ రావ్ జయంతి సందర్భంగా శక్కర్‌నగర్ చౌరస్తాలోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో పాటు పట్టణ ప్రముఖులు, తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ శ్రీనివాస్, తహసీల్దార్ విఠల్, పాషామొయినోద్దీన్, గిర్దావర్ గంగారెడ్డి, శరత్ రెడ్డి, రామరాజు, సుధాకర్ చారి, శ్రీకాంత్‌లు పాల్గొన్నారు.

రెంజల్: స్వాతంత్ర సమరయోధుడు, మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ 117వ జయంతి వేడుకలను మండలంలోని రెంజల్, తాడ్‌బిలోలి, బోర్గాం, నీలా, కళ్యాపూర్ గ్రామాలలో ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కుల వివక్ష కోసం నిరంతరతం పోరాటం చేసిన మహనీయుడు జగ్జీవన్ రామ్ అన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు మొగులనా, మల్ల సాయిలు, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, యోగేష్, సుమన్, అనంత్ రావు, రమేష్, మోహన్, శ్రీకాంత్, కృష్ణ, సాయిలు, ఆనంద్, సాయిలు, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

మెండోర: బాబు జగ్జీవన్ రామ్ ఆశయ సాధన కోసం నేటి యువత కృషి చేయాలని మాజీ ఎంపీపీ బురుకాల సుకన్య కమలాకర్ అన్నారు. మండలంలోని సోన్‌పేట్ గ్రామంలో శనివారం బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా జగ్జీవన్ రామ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బాబు, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వేల్పూర్: మండలంలోని పచ్చల నడ్కుడ గ్రామంలో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను దళిత సంఘాల నాయకులు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జగ్జీవన్‌రామ్, మహాత్మజ్యోతి బాపులే విగ్రహాలు గ్రామంలో ప్రతిష్ఠించుకోవడానికి భూమి కేటాయించాలని సంతకాల సేకరణ చేసి గ్రామాభివృద్ధి కమిటీకి, గ్రామ కార్యదర్శికి, తహసీల్దార్‌కు, కలెక్టర్‌కు, ఇరిగేషన్ ఇంజనీర్‌కు దళితులు వినతిపత్రం అందజేశారు.ఈ కార్య క్రమంలో దళిత సంఘ సభ్యులు ప్రతాప్, రవి, నెహ్రు, మోహన్, ప్రవీన్,శంకర్,సంఘ సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

నవీపేట: మండలంలోని నాళేశ్వర్‌లో శనివారం భారత మాజీ ఉప ప్రధానమంత్రి బాబు జగ్జీవన్ రాం జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబు జగ్జీవన్ రాం విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కిషన్, రాజు, ప్రసాద్, రాకేష్, పోశెట్టి తదితరులున్నారు.

ఆర్మూర్ టౌన్: పట్టణంలోని మల్లారెడ్డి చెరువు దగ్గర బాబు జగ్జీవన్ రామ్ జయంతిని పలువురు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ వినయ్‌కుమార్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ సాయిబాబ గౌడ్, ఆర్ఆర్ ఫౌండేషన్ డైరెక్టర్ సుచరిత రెడ్డి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు మందుల బాలు, జెస్సు అనిల్, నూతుల శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పూజ నరేందర్, సీపీఎం డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేశ్, పట్టణ కార్యదర్శి కుతాడి ఎల్లయ్య, ఎంఆర్‌పీఎస్ నాయకుడు ఇందరపు రాజు, మున్సిపల్ సానిటరి ఇన్‌స్పెక్టర్ గజానంద్, సీనియర్ అసిస్టెంట్ శేఖర్, దళిత నాయకుడు గుమ్మడి చంద్రయ్య, పింజ అశోక్ లు బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

● దళిత సంఘాల ఆధ్వర్యంలో అన్నదానం

పట్టణంలోని మల్లారెడ్డి చెరువు కట్టపైన బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకొని దళిత సంఘాల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జంగంగోపి, రింగుల భూషన్,తదితరులు పాల్గొన్నారు.

భీమ్‌గల్: తెలంగాణ రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని పార్టీ పట్టణ అధ్యక్షుడు జేజే నర్సయ్య అన్నారు. ఏఐసీసీ ఆదేశాల మేరకు చేపడుతున్న జైబాపు, జైభీమ్, జైసంవిదాన్ కార్య క్రమాన్ని పట్టణ కేంద్రంలోని పదో వార్డు, రెండో వార్డులలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు స్వామి, నాయ కులు అనంతరావు, కుంట రమేష్, గోపాల్ నాయక్, నాగేంద్ర, మహేష్, సుంకరి సురేష్, కల్పన, గంగామణి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎడపల్లి: స్వాతంత్ర సమరయోధుడు, మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతి వేడుకలను మండలంలోని ఆయా గ్రామాలలో ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుల వివక్ష కోసం నిరంతరతం పోరాటం చేసిన మహనీయుడు జగ్జీవన్ రామ్ అన్నారు. స్వాతంత్ర సమరయోధుడిగా కేంద్ర ప్రభుత్వంలో న్యాయశాఖ, కార్మిక వ్యవసాయశాఖ మంత్రిగా పని చేసిన బాబు జగ్జీవన్ రామ్ దేశానికి ఎన్నో సేవలను అందించారని కొనియాడారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పాటుపడ్డారని పేర్కొన్నారు. అట్టడుగు స్థాయి కుటుంబంలో జన్మించిన ఆయన భారత దేశ ఉప ప్రధానిగా బాధ్యతలు చేపట్టి ఎన్నో సంస్కరణలు చేపట్టారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు శంకర్ నాయుడు, డల్లా సురేష్, మచ్చూరి గంగాధర్, బుడ్డ పోశెట్టి, కర్రోల్ల గంగాధర్, రమణా గౌడ్ తదితరులు ఉన్నారు.

కోటగిరి: మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రావ్ భావితరాలకు ఆదర్శ ప్రాయుడని కోటగిరి మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతు పేర్కొన్నారు. కోటగిరి మండల కేంద్రంలోని హరిజన వాడ కాలనీలో శనివారం బాబు జగ్జీవన్ రావ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు శ్రీకాంత్, నాయకులు మనోహర్, బర్ల మధుకర్, గంగాధర్ రావు దేశాయ్, భీమ సాయిరెడ్డి, దావులయ్య, ఆర్టీసీ సాయిలు, దినేష్, గంగారాం, లాలయ్య పాల్గొన్నారు.

● పొతంగల్‌లో..

పొతంగల్ మండల కేంద్రంలోని బాబు జగ్జీవన్ రావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాని పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దేశ ఉప ప్రధానిగా బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ హన్మంతు, ఉపాధ్యాయులు నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

కోటగిరి: రుద్రూరు మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలో శనివారం డాక్టర్ బాబు జగ్జీవన్ రావ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్ రావ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. స్వాతంత్ర సమరయోధుడిగా, ఉప ప్రధానిగా దేశానికి అందించిన సేవలను కొనియాడారు. దళితుల అభ్యున్నతికి ఎంతగానో కృషి చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు చంద్రశేఖర్, విండో చైర్మన్ సంజీవ్ రెడ్డి, మండల అధ్యక్షులు తోట అరుణ్, కార్తీక్, అంబం గ్రామ ప్రత్యేక అధికారి సంతోష్, పోచయ్య, సాయిలు, రాములు తదితరులు పాల్గొన్నారు.

మోస్రా: చందూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాన్ని శనివారం రాష్ట్ర వ్యవసాయ సలహాదారుడు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుల, మత విభేదాలు లేకుండా కొందరిని ఆరాధించవచ్చని అందులో బాబు జగ్జీవన్ రాం ఒక్కరని ఆయన పేర్కొన్నారు. జగ్జీవన్ రాం విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. లక్షలాది మంది ప్రాణ త్యాగం చేస్తే స్వాతంత్రం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నీలావతి, ఉమ్మడి వర్ని మండల మార్కెట్ కమిటీ అధ్యక్షుడు సురేష్ బాబా, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచ్ సాయిరెడ్డి, సహకార సంఘం అధ్యక్షుడు అశోక్, డాక్టర్ బాబు జగ్జీవన్ రాం సంఘం మండల అధ్యక్షుడు సాయిలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఉమ్మడి వర్ని మండల పోలీస్ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మోర్తాడ్: మండల కేంద్రంలోని దళిత రత్న బాబు జగ్జివన్‌రామ్ 118వ జయంతిని దళితులు ఘనంగా జరుపుకున్నారు. శనివారం ఉదయం జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దమనుష్యులు గంగారాం, ముత్తెన్న, గంగాదర్, గురువయ్య, సంఘ సభ్యులు పాల్గొన్నారు.



పచ్చల నడ్కుడలో .



రుద్రూర్..



సోన్‌పేట్‌లో..

కొనుగోలు కేంద్రాలను ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలి



నీలాలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

నవీపేట,ఏప్రిల్5(ఆంధ్రజ్యోతి): యాసంగి పంటలకు చెందిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల నుండి రైస్‌మిల్లులకు తరలించే సమయంలో నిర్లక్ష్యంగా వహిస్తే చర్యలు తప్పవని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి హెచ్చరించారు. శనివారం ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండలంలోని అభంగపట్నం, నవీపేటలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాలలో తూకం వేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్‌మిల్లులకు తరలించాలని సూచించారు. లారీల డ్రైవర్లు నిర్లక్ష్యం వహిస్తే వారిపై తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. ఈ సందర్భంగా అభంగపట్నం ఎర్రకుంట రిజర్వాయర్ తూముకు వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని ఇరిగేషన్ ఈఈ బలరాంను ఫోన్‌లో ఆదేశించారు. ఈ సందర్భంగా నాగేపూర్ రామాలయాన్ని సందర్శించి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, శ్రీనివాస్ గౌడ్, రాజేందర్ గౌడ్, మహిపాల్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, బాల్‌రాజ్ గౌడ్, మోస్రా సాయిరెడ్డి, భగవాన్, సంజీవ రెడ్డి, మండల మహిళ సమాఖ్య అధ్యక్షురాలు ఉషారాణి, వినోద, సుజాత, డీఆర్‌డీవో సాయాగౌడ్, ఐకేపీ డీపీఎం సాయిలు తదితరులు పాల్గొన్నారు.

రెంజల్: రైతులు తాము పండించిన పంటను దళారుల పాలు చేయకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని నీలా గ్రామంలోని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. రికార్డులను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, మండల అధ్యక్షులు మొబిన్ ఖాన్, నాయకులు గయాసుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

● ఆలయ అభివృద్ధికి కృషి చేయాలి : ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

రెంజల్: ఆలయాల అభివృద్ధికి తమవంతు బాధ్యతగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం తాడ్‌బిలోలి రామాలయ కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేశారు. వేద పండితులు పూర్ణకుంభం స్వాగతం పలికి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షులు దినేష్ రెడ్డి, మండల అధ్యక్షులు మొబిన్ ఖాన్, ఏసీపీ శ్రీనివాస్, జిల్లా సీనియర్ నాయకులు మహిపాల్ రెడ్డి, సాయిరెడ్డి, సీహెచ్ రాములు, ధనుంజయ్, సాయిబాబా గౌడ్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ బోధన్ నియోజకవర్గ కన్వీనర్ కార్తీక్ యాదవ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు గైని కిరణ్, రామాలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్, డైరెక్టర్లు బుక్క గంగాదర్, నరేష్, అశోక్, సాయన్న, నాయకులు పాల్గొన్నారు.

మోర్తాడ్: మండల కేంద్రంలోని పీఏసీఎస్ ఆవరణలో శనివారం వరి కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ బద్దం అశోక్‌రెడ్డి, మానిటరింగ్ అధికారి నర్సింగ్ రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్లు మహిపాల్, నవీద్, అశోక్‌రెడ్డి, సంఘ డైరెక్టర్లు, కార్యదర్శి కాశీరాం, రైతులు పాల్గొన్నారు.

కోటగిరి: రైతులకు గిట్టుబాటు ధరను అందించేందుకు ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోటగిరి మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సంఘం అధ్యక్షురాలు సురేఖ, ఐకేపీ సీసీలు, వీవోఏ ప్రణిత పాల్గొన్నారు.

జుక్కల్: జుక్కల్ మండలం కండె బల్లూర్ గ్రామంలో శనివారం జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన ధాన్యమును ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేసి రైతులను అభివృద్ధి చేయడమే రేవంత్ రెడ్డి ప్రభుత్వం లక్ష్యమని ఆయన అన్నారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

మద్నూర్: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సన్న రకం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మద్నూర్ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు పరమేష్ పటేల్ అన్నారు. శనివారం డోంగ్లీ మండలం కుర్ల గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమనికి ఐకేపీ ఏ.పీ.ఎం రవీందర్, ఏ.ఇ.ఓ అంజూమ్, డ్వాక్రా మహిళా గ్రూప్ మహిళలు నగేష్ పటేల్,డాక్టర్ రాజేందర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ చెక్కు అందజేత

రెంజల్,ఏప్రిల్5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సామాన్యుడితో పాటు ప్రతి ఒక్కరికి ఆరోగ్యపరంగా తాము తోడు ఉన్నామంటూ ఆపదలో ఉన్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా వైద్య ఖర్చుల నిమిత్తం అన్ని విధాలుగా ఆదుకుంటుందని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, మండల అధ్యక్షులు మొబిన్ ఖాన్, రామాలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్,పాల్గొన్నారు.

వేల్పూర్: వేల్పూర్ మండలం జాన్కంపేట్ గ్రామం లో మంజూ రైన సీఎంఆర్ఎఫ్ చెక్కును శనివారం బాధితుడికి టీఆర్ఎస్ నాయ కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సౌడ రమే ష్, మాజీ ఎంపీటీసీలు సౌడ చందన్, గాదెపల్లి సత్యంరెడ్డి, సొసైటీ మాజీ వైస్ చైర్మన్ గ్రామశాఖ అధ్యక్షుడు తదితరులు పాల్గొన్నారు

సీసీ రోడ్డు పనుల ప్రారంభం

మాక్లూర్ , ఏప్రిల్ 05,(ఆంధ్రజ్యోతి): ఆలూర్ మండలం రాంచంద్రపల్లి గ్రామ ంలో కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇంచార్జ్ వినయ్‌రెడ్డి ఆదేశా ల మేరకు శనివారం స్మశాన వాటిక వద్ద సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. నిధుల మంజూరుకు కృషి చేసిన వినయ్‌రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వర్ని: వర్ని మండలం జలాల్‌పూర్ గ్రామంలో శనివారం సీసీ రోడ్డు పనులను మార్కెట్ కమిటీ చైర్మన్ కులకర్ణి సురేష్ ప్రారంభించారు. ఎస్‌డీఎఫ్ నిధులతో ఈ రోడ్డును నిర్మిస్తున్నారు. ఈ కార్యక్రమంలో నేమాని వీర్రాజు, డైరెక్టర్ సాయిలు, ఈల్తెపు బాలు, పెద్ద నెత్తి లక్ష్మణ్, బాబన్న, రామకృష్ణ, యూసుఫ్, బుద్దె గంగాధర్, ఒడ్డే శ్రీను, పిట్ల సాయిలు పాల్గొన్నారు.

మోర్తాడ్:మండలంలోపి వడ్యాట్ గ్రామంలో శనివారం సీసీ రోడ్డు పనులకు కాంగ్రెస్ నాయకులు భూమిపూజ చేశారు. బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్‌కుమార్ సీసీ రోడ్డు నిర్మాణానికి రూ. 5 లక్షలు మంజూరు చేయించారు. ఈ కార్యక్రమంలో రాములు, గిర్మాజి గోపి, నవీన్, పెండెం శ్రీనివాస్, నందంగౌడ్, లింబాద్రి, డాక్టర్ పాల్గొన్నారు.


హనుమాన్ స్వాముల మండల పూజ

కోటగిరి,ఏప్రిల్5(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని శ్రీ వీరభద్ర స్వామి ఆలయంలో శనివారం హనుమాన్ స్వాములు మండల పూజ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి శివప్ప, గురుస్వామి ఉన్నారు.

మహనీయులను గౌరవించడం నేర్చుకోవాలి : డీసీసీబీ చైర్మన్

నందిపేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రతీ మనిషి మహనీయులను గౌరవించడం నేర్చుకోవాలని డీసీసీబీ చైర్మన్ కుంట రమేష్ రెడ్డి తెలిపారు. శనివారం నందిపేట మండలంలోని మల్లారం, ఐలాపూర్ గ్రామాలలో జై బాపు, జై బీమ్, జై సంవిదాన్ కార్యక్రామాన్ని నిర్వహించారు. ముందుగా గ్రామాలలో ఉన్న మహనీయులైన జాతి పిత, మహాత్మా గాంధీ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలు వేశారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెంట ఇంద్రుడు, మండల పార్టీ అధ్యక్షులు మంద మహిపాల్, ఐలాపూర్ సోసైటీ చైర్మెన్ మీసాల సుదర్శన్, మాజీ చైర్మెన్ సిద్దాపురం లక్ష్మినారాయణ, సీనియర్ నాయకులు ఉన్నారు.

ఎడపల్లి: రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు ప్రజల భాగస్వామ్యం అవసరమని, ప్రజాస్వామ్య పరిరక్షణ అందరి బాధ్యత అని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు యాదగిరి అన్నారు. భారత రాజ్యాంగం ప్రకారమే పార్లమెంట్‌లో ప్రసంగిస్తున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పులి శ్రీనివాస్ రావు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు శంకర్ నాయుడు, బంజ కామప్ప, తూటుక్కార్ రవీందర్ రెడ్డి, బొబ్బిలి శ్రీనివాస్, యాసాద రాజ్ కుమార్, సంజయ్, కంచరి శ్రీనివాస్,తదితరులు ఉన్నారు.



ఆదర్శనగర్‌లో మహిళలను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న వినయ్‌రెడ్డి

ఆర్మూర్ రూరల్:ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో శనివారం ఆర్మూర్ నియోజకర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వినయ్‌రెడ్డి జైభీమ్, జైబాపు, జైసంవిదాన్ కార్యక్రమంలో ఆర్మూర్ పట్టణంలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. 8, 9, 24 వ వార్డులలో ఆయన పర్యటించారు. ఆదర్శ నగర్‌లో కాలనీ వాసులతో మాట్లడి సమస్యలు అడిగి తెలుసుకుని అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తామన్నారు. ఆయన వెంట ఏఎంసీ చైర్మన్ సాయిబాబాగౌడ్, మాజీ కౌన్సిలర్లు రవిగౌడ్, కాశీరాం, ఆకుల రాము, బోండ్ల సంతోష్, మోత్కురి లింగాగౌడ్, ఎండి సలీం తదితరలున్నారు.

కమ్మర్‌పల్లి: గత పదేళ్లుగా భారత రాజ్యాంగాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవమాన పరుస్తువస్తు రాజ్యాంగ స్ఫూర్తిని దుబ్బతీస్తు అప్రజాస్వామిక పాలన సాగిస్తున్నదని ప్రజాస్వామ్యవ్యవస్థను నాశనం చేస్తున్నారని ఐడిసిఎమ్మెస్ చైర్మన్ బదావత్ తారాచంద్, బాల్కొండ ఇన్‌చార్జ్ ముత్యాల సునీల్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సుంకెట రవి, మార్కెట్ కమిటీ అద్యక్షడు పాలెపు నర్సయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.


శక్కర్‌నగర్ రామాలయం ముఖద్వారం


రామాలయంలోని విగ్రహ మూర్తులు


కోటగిరి మండల కేంద్రంలోని రామాలయం

శ్రీరామ నవమి వేడుకలకు ముస్తాబైన రామాలయాలు


పడిగెలలో ముస్తాబైన రామాలయం


ముస్తాబైన మూల విరాట్, మూర్తులు

● బోధన్ కోదండ రామాలయం

బోధన్‌రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శక్కర్‌నగర్‌లోని రామాలయం భక్తులకు కొంగుబంగారం ప్రసిద్ది చెందింది. ఈ రామాలయానికి ఎంతో విశిష్టత ఉండడంతో ప్రతి ఏటా శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తారు. శ్రీరామ నవమి రోజు వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివస్తారు. ఈ ఆలయానికి ఎంతో ఘనమైన చరిత్ర ఉండడంతో ఈ ఆలయం శ్రీరామ నవమి వేడుకలకు ప్రత్యేకమైన ఆకర్షణగా నిలుస్తుంది. శక్కర్‌నగర్ రామాలయంలో శ్రీ సీతారాముల సతీస మేతంతో పాటు హనుమంతుడితో వెలిసిన విగ్రహాలు దర్శనమిస్తాయి. 1951లో ఈ ఆలయాన్ని నిర్మించినట్లు చరిత్ర చెబుతుంది. ఆలయంలోని సీతారాముల లక్ష్మణ, అంజనేయ స్వామి విగ్రహాలు పాలరాతితో నిర్మించబడి ఉంటాయి. ఆలయంలో శ్రీ రామ చంద్రుల విగ్రహాలు పశ్చిమాది ముఖం ఉండడంతో రెండవ భద్రాద్రిగా శక్కర్‌నగర్ రామాలయాన్ని పిలుచుకుంటారు. ఆలయానికి సుమారు 20లక్షలతో రాజగోపురం నిర్మాణం చేపట్టారు. భక్తుల సౌకర్యార్థం గదులను నిర్మించారు. ప్రతి ఏటా శ్రీరామ నవమి రోజు ప్రత్యేక పూజలు, సీతారాముల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. సాయంత్రం విగ్రహాల ఊరేగింపు కన్నుల పండువగా కొనసాగుతుంది.

● శక్కర్‌నగర్ రామాలయంలో..

శక్కర్‌నగర్ రామాలయంలో ఆదివారం శ్రీరామనవమి వేడుకలు కొనసాగనున్నాయి. ఉదయం నుంచే ఆలయంలో వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. 9గంటల నుండి 12గంటల వరకు సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నామని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల వసతులు ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఏసీపీ తెలిపారు.

కోటగిరి: కోటగిరి ఉమ్మడి మండలంలో ఆదివారం సీతారాముల కల్యాణ మహోత్సవానికి రామాలయాలు ముస్తాబయ్యాయి. మండలంలోని కోటగిరి, ఎక్లాస్‌పూర్, కొత్తపల్లి, బస్వాపూర్, నాగేంద్రపురం, కల్లూర్, పొతంగల్, ఎత్తొండ గ్రామాల్లోని రామాలయాల్లో కల్యాణ మండపాలను ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కల్యాణ మహోత్సవం తిలకించేందుకు ప్రత్యేక టెంట్లు ఏర్పాటు చేశారు. సీతారాములను దర్శించుకునేందుకు క్యూలెన్లు ఏర్పాటు చేశారు. కల్యాణం అనంతరం భక్తులకు మహా అన్నదాన ప్రసాద కార్యక్రమం ఏర్పాటు చేశారు.

నవీపేట: మండలంలోని పలు గ్రామాలలో ఆదివారం శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. మండలంలోని నవీపేట, కమలాపూర్, అంజుమాన్ ఫారం, అభంగపట్నం తదితర గ్రామాలలోని రామాలయాలలో శ్రీరామ నవమి వేడుకలు నిర్వహించనున్నారు. మండలంలోని కమలాపూర్ కోదండ రామాలయంలో శ్రీ సీతారాముల కల్యాణం నిర్వహించడానికి ఆలయ అర్చకులు జోషి నర్సింహ శర్మ తయారు చేయించిన శుభలగ్న పత్రిక అందరిని ఆకట్టుకుంటుంది.

వేల్పూర్: ఆదివారం జరుగనున్న సీతారామ కళ్యాణమహోత్సవం కోసం మండలంలోని వేల్పూర్; పడిగెల, పచ్చల నడ్కుడ, కోమన్‌పల్లి తదితర గ్రామాల్లో ఆలయాలు అన్ని హంగులతో అందంగా ముస్తాబయ్యాయి. ఈ ఉత్సవాలకు వచ్చే భక్తుల కోసం అయా గ్రామంలోని గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అందులో బాగంగానే పడిగెల గ్రామంలో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఉదయం శనివారం సీతారామ చంద్రస్వామి ఆలయంలో ఉదయం అభిషేకం, అర్చన, పుణ్యావచనం, పుట్ట మన్ను సేకరణ, అంకురారోహనం, ధ్వజారోహణం, హోమం వంటి కార్యక్రమాలను నిర్వహించారు.

ముప్కాల్: శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకొని రెంజర్ల కోదండ రామాలయం ముస్తాబు చేశారు. రాముల వారి కల్యాణం కోసం ఆలయాన్ని అంగరంగ వైభవంగా ముస్తాబు చేశారు. ఆదివారం ఉదయం స్వామివారికి ఆలయ అర్చకులు ముత్యాల తలంబ్రాలతో సీతరాముల కల్యాణం ఘనంగా నిర్వహించనున్నారు. పరిసర గ్రామాల నుంచి హాజరయ్యే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు ఆలయ కమిటి సభ్యులు తెలిపారు.

పుట్టినరోజు వేడుకలకు ముస్తాబైన సాయిబాబా ఆలయం


వేడుకలకు ముస్తాబైన మాధవనగర్ సాయిబాబా ఆలయం

నిజామాబాద్ కల్చరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): సద్గురుగా భావించే సాయిబాబా పుట్టినరోజు వేడుకలకు ఆలయాలు సిద్ధమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా సాయిబాబా ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయాల్లో పుట్టినరోజును పురస్కరించుకొని ప్రత్యేకంగా అలంకరించిన ఉయ్యాలలో వేడుకను నిర్వహించేందుకు ఏర్పాట్లయ్యాయి. శ్రీరామనవమి రోజుననే సాయిబాబా జన్మించినట్లు చరిత్రద్వారా తెలుస్తుంది. దీంతో పలు ఆలయాల్లో సాయిబాబా జన్మదినోత్సవ వేడుకలతో పాటు సీతారాముల కల్యాణోత్సవ వేడుకలు నిర్వహించడానికి వేదికలు సిద్ధం చేశారు. జిల్లా కేంద్రంలోని మాధవనగర్ సాయిబాబా ఆలయం, హమాల్‌వాడి సం తోషిసాయి దేవాలయం, ముబారక్‌నగర్ సాయిబాబా ఆలయం, తేనె సాయిబాబా ఆలయం, చేపూర్ సాయిబాబా ఆలయం, జిల్లా వ్యాప్తంగా ఆలయాలను మామిడి తోరణాలు, అరటాకులతో ముస్తాబు చేశారు.

ఉపాధి కూలీలకు కానరాని వసతులు

● ఎర్రటి ఎండలో ఇబ్బందులు పడుతున్న కూలీలు ● ఎండను తట్టుకోలేక తగ్గిన కూలీల సంఖ్య ● సౌకర్యాలు కల్పించాలని ఆవేదన ● పట్టించుకోని అధికారులు

ఆంధ్రజ్యోతి పరిశీలన

భీమ్‌గల్ రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఎండల తీవ్రత రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఉదయం ఎనిమిది గంటల నుంచి భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. ఇలాంటి పరిస్థితుల్లో మట్టి పనులు చేయడం ఉపాధి హామీ కూలీలకు కష్టసాధ్యమే. పైగా పనిచేసే ప్రదేశాల్లో కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలం కావడంతో కూలీలు ఇబ్బందులకు గురవుతున్నారు. పని ప్రదేశంలో టెంట్లు వేయడం లేదు. అలాగే కనీస తాగు నీరు కూడా పెట్టడం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగు నీరు ఇంటి నుంచి తెచ్చుకుంటున్నామని కూలీలు వాపోతున్నారు. గ్రామాల్లో వలసలు తగ్గించి స్థానికంగా పనులు కల్పించాలని కేంద్ర ప్రభుత్వం గతం లో జాతీయ గ్రామీణ ఉపాధిహామి పథకం ప్రవేశ పెట్టింది. ఈ ఉపాధి హామీ పథకం చట్టం ప్రకారం పని ప్రదేశాలోల నీడకోసం టెంట్లు, తాగు నీరు, ఫస్ట్ ఎయిడ్ కిట్స్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ని బంధనలు ఉన్నప్పటికీ ఈ సౌకర్యాలు ఏమాత్రం భీమ్ గల్ మండలంలో కూలీలకు కల్పించడం లేదు. ఎర్రటి ఎండలో ఉపాధి హామీ పనులు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పూట గడవాలంటే ఉపాధి హామీ పనులకు వెళ్ళక తప్పదు. దీంతో గత్యంతరం లేక ఎండలో పనులు చేస్తు అస్వస్థతకు గురై చేసిన డబ్బులు ఆసుపత్రిలో ఖ ర్చు చేస్తున్నారు. కొంతమంది కూలీలు ఎండకు తట్టు కోలేక పనులకు పోవడం లేదు. గతంలో కంటే కూలీల సంఖ్య 50 శాతం తగ్గింది. దీనికి ముఖ్య కారణం పనుల వద్ద కనీస సౌకర్యాలు కల్పించక పోవడమే. ఈ ఉపాధిహామి పనులు చేయడానికి నాలుగు కిలోమీటర్ల దూరం నడవాల్సి వస్తుందని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూలీ డబ్బులు కూడా సకాలంలో ఇవ్వకుండా రెండు నెలలకోసారి అకౌంట్లో జమచేస్తున్నారని కూలీలు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పం దించి పనిచేసే ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలని ఉపాధిహామీ కూలీలు కోరుతున్నారు. భీమ్‌గల్ మండలంలో మొత్తం 27 గ్రామ పంచాయతీలు ఉండగా 12073 జాబ్ కార్డులు ఉన్నాయి. మొత్తం కూలీల సంఖ్య 1750, మొ త్తం పనిచేసే గ్రూపులు 170 ఉన్నాయి.


బేస్‌మెంట్ లెవెల్‌లో అర్ధంతరంగా ఆగిన పంపు హౌజ్ పనులు


వృథాగా పడివున్న పైపులు

పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పిస్తాం..
ఈజీఎస్, ఏపీవో నర్సయ్య



మండలంలో ఉపాధి పనులు మార్చి నెలలో ప్రారంభమయ్యాయి. కూలీలకు సౌకర్యాలు కల్పిస్తాం. పనిచేసే ప్రదేశాల్లో టెంట్‌లు, పరికరాలకు ప్రభుత్వం నుంచి నిధులు వచ్చేవని ఇట్టి నిధులు 2011 సంవత్సరం నుంచి రావడంలేదు. కూలీల డబ్బులు వెనువెంటనే ఖాతాలో జమ చేస్తున్నారన్నారు.


ఎండలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

మధ్యలోనే నిలిచిన బొంకన్‌పల్లి ఎత్తిపోతల పనులు

● ఆందోళనకు గురవుతున్న అన్నదాతలు

మాక్లూర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలను ఆదుకునేందుకు గుత్ప ఎత్తిపోతల నుంచి లక్మాపూర్ వద్ద నిర్మిస్తున్న బొంకంపల్లి ఎత్తిపోతల పనులు అర్థంతరంగా ఆగిపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఎత్తిపోతల పనులు పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు హామి ఇచ్చి మూడు సంవత్సరాలు పూర్తయిన పనులు పూర్తికాక అర్థంతరంగా ఆగిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ముల్లంగి, బొంకంపల్లి గ్రామాలకు తాగు నీరు అందించేందుకు అప్పటి జిల్లా పరిషత్ చైర్మన్ దాదానగర్ విఠల్‌రావ్ రెండు గ్రామాలకు కలిపి సుమారు 1200 ఎకరాలకు సాగునీరు అందించే ఉద్ధేశంతో నాటి ముఖ్యమంత్రి కే. చంద్ర శేఖర్‌రావుతో ఉన్న అనుబంధంతో రూ. 11 కోట్ల 70 లక్షలను ఎత్తిపోతల పథకానికి మంజూరు చేయించడంతో ఆ రెండు గ్రామాల ప్రజలతో పాటు మండల రైతులు ఆయన చేసిన కృషికి ప్రశంసించారు. 2023 సంవత్సరంలో పనులను ప్రారంభించారు. పంపౌజ్ వద్ద బేస్‌మిట్ వరకు, పైప్‌లైన్ పనులు రాంపూర్ వరకు వేసి వదిలివేశారు. దీంతో ఆందోళనకు గురైన రైతులు అంటు కాంట్రాక్టర్, ఇటు అధికారులకు మొరపెట్టుకున్న పనులను మాత్రం పట్టించుకోకపోవడంతో రైతులు వాపోతున్నారు. ఇకనైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రైతుల సంక్షేమం దృష్ట నిలిచిన పనులను వెంటనే పూర్తి చేయాలని వారు కోరుతున్నారు.

లిఫ్టు పనులు పూర్తయితే మరిన్ని ఎకరాలకు సాగునీరు అందేది

● రమణరావు, ముల్లంగి గ్రామ రైతు

లిఫ్ట్ ఎత్తిపోతల పనులు సకాలంలో పూర్తయితే మరిన్ని ఎకరాలకు సాగునీరు అందేది. వేసవిలో నీటి ఎద్దడి దృష్య పంటలకు సాగు నీరు అందక అక్కడక్కడ పంటలు దెబ్బతిన్నాయి. రైతుల శ్రేయస్సు దృష్ట్యా ఇకనైనా అధి కారులు వెంటనే స్పందించి పనులు పూర్తి చేసి రైతులను ఆదుకోవాలి.


ఉపాధి హామీ పనులు చేస్తున్న దృశ్యం

భక్తుల కొంగు బంగారం.. శబరిమాత ఆశ్రమం

● నేటితో శబరిమాత జీవ సమాధికి 25 ఏళ్లు ● తాడ్వాయి శబరిమాత ఆశ్రమానికి ఘనమైన చరిత్ర ● నిత్య అన్నదానంలో దిన దిన అభివృద్ధి చెందుతున్న ఆశ్రమం

భక్తి


శబరిమాత ఆశ్రమం


ఆశ్రమం ముందర గుట్టపై అందమైన హనుమాన్ విగ్రహం


ఆశ్రమంలో కొలువుదీరిన దేవత మూర్తులు వెంకటేశ్వర స్వామి

తాడ్వాయి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): పచ్చని చెట్లు అహ్లాదకరమైన వాతావరణం.... పక్కనే తాడ్వాయి చెరువు చూడచక్కని హనుమాన్ విగ్రహం వీటి మధ్యన వెలసిన క్షేత్రమే శబరిమాత ఆశ్రమం. తాడ్వాయి గ్రామంలో వెలసిన శ్రీ శబరిమాత ఆశ్రమంలో భక్తుల కోరిన కోరికలను తీర్చే కొలువైన తల్లిగా కొంగు బంగారంగా వివిధ రాష్ట్రాల, జిల్లాల, గ్రామాల శబరిమాత భక్తులు భావిస్తారు. నేటితో అమ్మ జీవ సమాధి పొంది 25 ఏళ్లు. శ్రీ శబరిమాత ఆశ్రమంలోనే సమాధి పొంది నేటికి 25 సంవత్సరాలు పూర్తి కావస్తుంది. దీంతో ఆలయ కమిటీ నిర్వాహకులు ఏప్రిల్ 5, 6వ తేదీల్లో వార్షికోత్సవాలను ఘనంగా పెద్దఎత్తున నిర్వహించేందుకు సన్నహాలు చేశారు. దీంతో భక్తులు పెద్దఎత్తున కాలినడకన బయలుదేరి ఆశ్రమానికి చేరుకుంటారు. ఈ ఉత్సవాలలో రుద్ర, సహిత, నవ, చండి హోమము మహాత్ముల దివ్య ప్రవచనాలు, పాదుక పూజలు, సీతారామ కళ్యాణ మహోత్సవం, రథోత్సవంతో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులు ఆట పాటలతో కన్నుల పండుగగా వేడుక జరుపుకుంటారు. ఈ ఉత్సవాలకు మహారాష్ట్ర కర్ణాటక బీదర్, తెలంగాణ రాష్ట్రాలలోని భక్తులు భజన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

● తాడ్వాయి శబరిమాత ఆశ్రమానికి ఘనమైన చరిత్ర

శ్రీ శబరిమాత మెదక్ జిల్లాలోని తొగుట గ్రామంలో ముదిరాజు వంశానికి చెందిన మల్కయ్య వీరమ్మ దంపతులకు 1945 సంవత్సరంలో అష్టమ సంతానంగా జన్మించారు. శబరిమాత జన్మించిన తొమ్మిది రోజులకు ఆ గ్రామంలో ఒక దివ్య యోగి రావడంతో ఇంటికి ఆహ్వానించగా ఈయన శబరిమాతకు మొదటగా జన్మనామం నాగలక్ష్మి అని నామకరణం చేశారు. మూడేళ్ల ప్రారంభంలోనే రెండు చేతులు పైకెత్తి రామ రామ విట్టల విట్టల అంటూ పాటలు పాడుతూ భజనలు చేయడానికి శ్రీరాముని దేవాలయానికి చేరుకునేది. దీనితో చిన్న నాటి నుంచే భక్తిని అలవర్చుకొని శ్రీరాముడి భక్తురాలిగా మారింది. తల్లి దండ్రులు నిద్రలోకి జారిపోగానే దట్టమైన అడవిలో మంగమ్మ గుట్టలో కొలువుదీరిన మంగమ్మ గుడికి వెళ్లి కట్టె బొమ్మను కౌగిలించుకొని రాత్రి తల్లివుడికి చేరింది. ఇలా నిద్రలోకి జారుకోగానే తరచూ వెళ్లడం గమనించిన శబరిమాత తల్లి వీరమ్మ ఇది చిన్న పిల్లలు చేసే పని కాదని ఇది దైవ ఘటన అని గ్రహించారు. అలా శబరిమాత ఇంటి నుండి వదిలి చీకటి ప్రయాణం సాగించారు. 12 ఏళ్ల ప్రాయంలో కుటుంబ సభ్యులు పెళ్లి చేసేందుకు ఆరాటపడు తుంటే ఈ సంసార సముద్రంలో మునిగి బాధపడలేనని సాధువైన తనకు భవ బంధాలు కలిఇంచడం భావ్యం కాదని తనకు దేవుడే దిక్కు శ్రీరాముడే తన పతి అని శబరిమాత సోదరునికి తెలిపింది. దీనితో శబరిమాత ఇంటిని వదిలి నగర సంకీర్తనలు చేసే భక్తులతో కలిసి గమ్యం తెలవకుండానే ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల మీదుగా కాలినడక న సాగిపోయింది. దీనితో తోడబుట్టిన చెల్లె జాడ కొరకు సోదరుడు వెదుక సాగాడు. ఆ సమయంలో ఏడుపాయల దుర్గమ్మ దగ్గర ముని గుట్ట దగ్గర బాల యోగిని గుహ వద్ద యోగనిద్రలో బ్రహ్మత్వాన్ని పొందిన శబరిమాత చుట్టూ పెద్ద పుట్ట వెలసింది. కొంత శరీరాన్ని చెదలు పట్టిన యోగ నిద్ర మాత్రం ఆపలేదు. దీంతో చెదలు పట్టడం చూసిన కొందరు గ్రామస్థులు శబరిమాతను లోక కళ్యాణం కొరకు ప్రచారం చేయాలని ఆమెను కోరారు. అప్పుడు శబరిమాత భక్తులతో కలిసి పాద యాత్రగా తరలివచ్చింది. అలా మొదలైన ప్రయాణం మళ్లీ తిరిగి శ్రీరామ స్మరణ కీర్తనలు చేస్తూ ఊరూరా వెళ్ళసాగింది. అడవిలో వన్నెమురుగాలే ఆప్తులయ్యాయి. పచ్చని చెట్లే అమ్మవారికి నివాసాల య్యాయి. ఇలా నగర సంకీర్తనలు చేస్తున్న వారితో భజనలు చేస్తూ ఎన్నో గ్రామాలు దాటుకుంటూ సర్దెనా గ్రామానికి అక్కడి నుంచి లింగంపేట్ చేరుకున్నారు. అక్కడి నుంచి తాడువాయి దేస్ ముఖ్ గ్రామస్తులు శబరిమాతను ప్రత్యక్ష దైవంగా కొలుస్తూ చల్లని దీవెనలు ఇవ్వాలని పాదాలకు నమస్కరించి భక్తులు ప్రాధేయపడటంతో తాడ్వాయి గ్రామానికి కదలివచ్చారు. అక్కడ దేశ్ ముఖలు నివాసం ఉండే గడికోటలో ఆరు సంవత్సరాల పాటు నివాసం ఉన్నారు. శబరిమాతకు ఆశ్రమం కట్టడానికి స్థల ఏర్పాటుకు ముఖ్యమైన శిష్యులు భక్తులు వెతకగా శివుడు తాండవం చేసే స్మశాన భూమి దగ్గర్లో ఒక కుటీరం ఏర్పాటు చేశారు. అనతి కాలంలోనే శబరిమాత కోట్ల భక్తులకు దైవమయ్యారు అక్కడనే స్థిరపడిపోయిన శబరిమాత 2000 సంవత్సరంలో శబరిమాత జీవ సమాధి పొందారు. దీంతో అమ్మకు ఏర్పాటు చేసిన కుటీరమే పవిత్ర స్థలమై లక్షలాదిమంది భక్తులకు పుణ్యస్థలం అయినది.


అమ్మవారి విగ్రహం


వేసవి బావి నిండా నీరున్న కోనేటి బావి

● శబరిమాత ఆశ్రమంలో నిత్య అన్నదానం

అప్పట్లో శబరిమాత ప్రతిరోజు ప్రకృతి సిద్ధంగా లభించే పండ్ల ఫలాలు మాత్రమే భుజించేది. కానీ అప్పటి నుంచి ఆశ్రమంలో నిత్య అన్నదానం చేస్తూ భక్తుల ఆకలి తీర్చే కొంగుబంగారం శ్రీ శబరిమాత వచ్చిన భక్తులకు శబరిమాత ఆశ్రమంలో నిత్య అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు ఇప్పటి వరకు ఏర్పాటు చేస్తున్నారు. అన్నదాన కార్యక్రమంలో ప్రతిరోజు 200 మందికి పైగా భక్తులకు నిత్య అన్నదానం చేస్తూ ఆకలి తీరుస్తున్నారు.

రైతులకు పరిహారం అందేవిధంగా చూస్తాం


వరిదాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

బిచ్కుంద,ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని బండరెంజల్ గ్రామం లో రేషన్ దుకాణాల ద్వారా అందిస్తున్న సన్నబియ్యం పథకాన్ని జుక్కల్ ఎ మ్మెల్యే తోటలక్ష్మీకాంతారావు ప్రారంభించారు. అనంతరం వాజిద్ నగర్ గ్రామాన్ని సందర్శించి అకాలవర్షానికి నేలకు వాలిన వరి, జొన్న పంటలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలందరూ కడుపు నిండా భోజనం చేయాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సన్నబియ్యం పంపిణీచేయడం జరుగుతుందని తెలిపారు. అకాల వర్షాలకు చేతికి వచ్చిన రైతుల పంటలకు నష్టం జరగడం బాధకరమని తెలిపారు. వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతులకు తగిన పరిహారం అందేవిధంగా చూస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు విఠల్ రెడ్డి, వెంకట్రాంరెడ్డి, నాగనాథ్, గంగాధర్, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

పిట్లం:ప్రభుత్వం ఎర్పాటు చెసిన దాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చెసుకోవాలని జుక్కల్ ఎమ్మెల్యే తోటలక్ష్మీకాంతారావ్ అన్నారు. శనివారం బండాపల్లి గ్రామంలో వరి దాన్యం కోనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈకార్యక్రముంలో విండో చైర్మెన్ శపథంరెడ్డి, ఎయంసి వైస్ చైర్మెన్ కృష్ణారెడ్డి,విండో వైస్ చైర్మెన్ వెంకట్‌రెడ్డి, నాయకులు హన్మండ్లు, రాంరెడ్డి, మురళీధర్‌గౌడ్, బాపురెడ్డి, విండో కార్యదర్శి ఉన్నారు.

పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడికి అభినందన సభ

ఉపాధ్యాయ వృత్తి నిర్వహిస్తునె అంచెలంచెలుగా ఎదిగి ఉపాద్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడి స్థాయికి చెరుకోవడం పట్ల గుండు లక్ష్మణ్ గారికి అభినందనలు తెలిపిన జుక్కల్ ఎమ్మెల్యే తోటలక్ష్మీకాంతారావ్.శనివారం స్థానిక సాయిగార్డెన్ పంక్షన్‌హల్‌లో సాయిగ్రూప్ వారి ఆద్వర్యంలో పిఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షుగా ఎన్నికైన గుండు లక్ష్మణ్ గారికి అభినందన సభ ఎర్పాటు చెశారు.ఈఅభినందన సభకు మఖ్యఅథితిగా జుక్కల్ ఎమ్మెల్యే విచ్చెసినారు. ఎమ్మెల్యేకు పిఆర్‌టియు నాయకులు ఘనంగా స్వాగతం పలికి పుష్ప గుచ్ఛం అందించి సన్మాణం చెశారు.

ఉపాధ్యాయల అభివృద్ధికి కృషి చేస్తాం:ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

ఉపాద్యాయ సంఘం సభ్యులందరికి ఎల్లవెలలా అందుబాటులో ఉండి అభివృద్దికి కృషి చెస్తానని ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి అన్నారు.ఉపాద్యాయ సవస్యలు ఉంటె పరిష్కారానికి కృషి చెస్తానన్నారు.ఈకార్యక్రమంలో పిఆర్‌టియు రాష్ట్ర జనరల్ సెక్రెటిరి దామోధర్‌రెడ్డి, పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు కుశాల్, కామారెడ్డి జిల్లా ఆర్‌టియు జనరల్ సెక్రెటరి శ్రీనివాస్‌రెడ్డి, సాయి గ్రూప్ సభ్యులు సంజీవ్‌రెడ్డి, రామాగౌడ్, విశ్వనాథం, రమేష్, పిఆర్‌టియు ఉపాద్యాయ సంఘం సభ్యులు, నాయకులు పాల్గోన్నారు.

విద్యా అధికారుల కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి

తాడ్వాయి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులపై జిల్లా విద్యాశాఖ అధికారుల కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని సెకండరీ గ్రేడ్ ఉపా ధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులు సోమిశెట్టి రాములు, ప్రధాన కార్యదర్శి పుల్లూరి స్వామిలు అన్నారు. గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల, స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయ సం ఘాలు ప్రాథమిక పాఠశాలల హెడ్మాస్టర్లపై చూపిస్తున్న కక్షపూరిత వైఖరిని చులకనగా చూడడాన్ని ఖండిస్తున్నామని తెలిపారు. ఈ నెల 3, 4వ తేదిలలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ట్రైనింగ్ కలదు కానీ ఉద్దేశపూర్వకంగా జిల్లా విద్యాశాఖ అధికారులు స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయ సంఘాలు గజిటెడ్ ప్రధానోపాధ్యాయులు అందరూ కలిసి గజిటెడ్ ప్రధానోపాధ్యాయు ట్రైనింగ్ సెంటర్‌ను నిజామాబాద్ జిల్లా బోర్గాం నుండి కామారెడ్డి జిల్లా చిన్న మల్లారెడ్డికి మార్చారు. కేవలం ప్రైమరీ ప్రధానోపాధ్యాయులకు జానకంపేటలో ట్రైనింగ్ ఉండేలా చేసి తమ తమ పక్షపాత ధోరణి చూపించారు ఇలా ట్రైనింగ్ సెంటర్ ను మార్చి కేవలం గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులకు అనుకూలంగా పనిచేసిన అందరిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని లేనియెడలపై స్థాయి అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. ఇకపై నుండి ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురి చేస్తే సహించబోమని అన్నారు.

ఘనంగా భగళాముఖి పీఠంలో అష్టమి పూజ

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని బీడీ వర్కర్స్ కాలనీలో ఆర్టీసీ బస్ డిపో పక్కన ఉన్న బగలాముఖి పీఠంలో శనివారం అమ్మవారి జన్మ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఘనంగా అష్టమి పూజ నిర్వహించారు. పీఠం నిర్వాహకులు క్రాంతి పటేల్ ఆధ్వర్యంలో ఉదయం నుండి వివిధ పసుల రసాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించి మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్రాంతి పటేల్ మాట్లాడుతూ భక్తిశ్రద్ధలతో అమ్మవారిని పూజిస్తే సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. ఈ పూజ కార్యక్రమానికి రాష్ట్రంలోని వివిధ జిల్లాలు మండలాలకు చెందిన వారు, భక్తులు, స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. రేవంత్ అప్ప, సంతోష్, శివ, తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్ పోస్టాఫీసులో ఆధార్ కేంద్రం ఏర్పాటు

మద్నూర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పోస్టాపీస్‌లో శనివారం ఆధార్ కేంద్రాన్ని అధికారులు ప్రారంభించారు. ఇటీవల మండల కేంద్రానికి చెందిన జహీరాబాద్ పార్లమెంట్ సోషల్ మీడియా కన్వీనర్ అజయ్ తమ్మే వార్ ఢిల్లీలో సంబంధిత కేంద్ర మంత్రి జ్యోతి రాదిత్యను కలిసి మద్నూర్ పోస్టు ఆఫీస్‌లో ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందజేశారు. ఆ మేరకు మంత్రి ఆదేశంతో సంబంధిత అధికారులు స్పందించి మద్నూర్‌లో శనివారం ఆధార్ కేంద్రాన్ని ప్రారంభించారు. మద్నూర్ మండల కేంద్రంలో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు హర్ష వ్యక్తం చేస్తున్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

మాచారెడ్డి,ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి):చికిత్స పొందుతూ శనివారం ఉదయం 50 సంవత్సరాల వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందినట్లు ఎస్ఐ అనిల్ తెలిపారు. మాచారెడ్డి మండల పోలీసుస్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తిని భవానిపేట గ్రామశివారులో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో స్థానికులు కామారెడ్డి ఆసుపత్రికి తరలించారు. సదరు వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు.

సన్న బియ్యం పంపిణీ

కామారెడ్డిటౌన్,ఏప్రిల్ 05(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పేదలకు నాణ్యతతో కూడిన సన్నబియ్యాన్ని పంపిణీచేస్తుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళ అధ్యక్షురాలు పాక జ్ఞానేశ్వరి తెలిపారు. శనివారం 31 వ వార్డులో రేషన్‌దుకాణాల ద్వారా పంపిణీచేస్తున్న సన్నబియ్యాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ప్రజలందరూ ఒకే రకమైన బియ్యాన్ని ఉపయోగించాలనే ఉద్దేశ్యంతో సన్నబియ్యాన్ని పంపిణీచేస్తుందని తెలిపారు. గతంలో పలువురు బియ్యం సరిగా లేవని దళారులకు అమ్ముకునే సందర్భాలు ఉన్నాయి. ప్రజలు సన్నబియ్యాన్ని వినియోగించుకోవాలని దళారులకు అమ్మవద్దని వాటిని తిరిగి రీసైక్లింగ్ ద్వారా మనకే అమ్మకాలు చేపడుతారని తెలిపారు.

నేడే శ్రీరామ నవమి

రామారెడ్డి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రానికి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న రామారెడ్డి మండల కేంద్రంలో శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయంలో శ్రీరామ నవమి వేడుకలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ రంగు రవీందర్ గౌడ్ తెలిపారు. గత రెండు రోజుల నుండి శ్రీ సీతారామచంద్రస్వామి, శ్రీ పార్వతిరాజేశ్వర స్వామి ఆలయాలు శుభ్రం చేస్తున్నామని ఆలయంతో పాటు పరిసర ప్రాంతాలను శుభ్రం చేస్తున్నామని తెలిపారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ బుర్ర ప్రభురాంచంద్రం గుప్తా, ప్రతినిధులు శంకర్ గౌడ్, కమ్మరి ఈశ్వర్, కూశన్నోల్ల రమేష్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి : అనంత్‌రెడ్డి


గొట్టిముక్కులలో మాట్లాడుతున్న అనంత్‌రెడ్డి

దోమకొండ, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి):జై భీమ్ జైబాపు జై సంవిదాన్ కార్యక్రమాన్ని మండలంలోని సంగమేశ్వర్, గొట్టిముక్కుల గ్రామాల్లో శనివారం కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అనంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్రబోయిన స్వామి, పల్లె రామస్వామిగౌడ్, తాటిపల్లి శ్రీకాంత్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ అంబేద్కర్ ఆశయం సర్వమత సమానమని పేర్కొన్నారు. భారత రాజ్యాంగాన్ని కాపాడుకుంటే దేశ ప్రజల జీవన స్థితిగతులు ప్రగతిపైపు పయనించడం ఖాయమని అన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, శ్రీకాంత్, ప్రభాకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, సీతారాం మధు, నల్లపు శ్రీనివాస్, ఏఎంసీ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, శమ్మి, శంకర్, శంకర్‌రెడ్డి, వినీత్, రమేష్, శేఖర్, బాల్‌నర్సు, బాల్‌రాజు, నరేష్, రాంరెడ్డి, నయీం తదితరులు పాల్గొన్నారు.

● లింగంపేటలో కాంగ్రెస్ నాయకుల జై సంవిదాన్ ర్యాలీ

లింగంపేట: లింగంపేట మండల కేంద్రం లో శనివారం కాంగ్రెస్ నాయకులు జైసంవిధాన్ ర్యాలీని నిర్వహించారు. భారత రాజ్యాంగం గొప్పతనాన్ని వివరిస్తూ భారత రాజ్యాంగాన్ని రక్షిందామంటూ వారు ర్యాలీ నిర్వహించారు. జై బాపు, జై భీం అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలపార్టీ అధ్యక్షుడు నారాగౌడ్, నాయకులు రఫీక్, భైరయ్య, ప్రసాద్‌గౌడ్, నగేష్, ఏదుల్, కౌడ రవి, అశోక్, సలీం, అఫ్రోజ్, కిరణ్, నవీద్, మోహన్‌గౌడ్‌లతో పాటు నాయకులు ఉన్నారు.

ఘనంగా జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు


దోమకొండలో వేడుకలను నిర్వహిస్తున్న దృశ్యం


భిక్కనూరులో..


ఎల్లారెడ్డిలో ..

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని లింగారెడ్డిపేట్ 11వ వార్డు పరిధిలోని అర్జునవాడ వద్ద ఉన్న జగ్జీవన్ రామ్ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కురుమ సాయి బాబా నాయకులతో కలిసి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఆయనతో పాటు పట్టణ అధ్యక్షుడు వినోద్ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్ రామ్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి ఉషా గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, నాయకులు శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ మహేష్ కుమార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అదే విధంగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు జలంధర్ రెడ్డి, ఆదిమూలం సతీష్, ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పిట్లం:స్థానిక మార్కెట్‌కమిటి కార్యాలయంలో డాక్టర్ బాబు జగ్జీవన్ రావ్ జయంతీ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వెసి నివాళులు అర్పించారు.ఈకార్యక్రమంలో ఎయంసి వైస్ చైర్మెన్ కృష్ణారెడ్డి, మండల అధ్యక్షులు హన్మండ్లు, నాయకులు రాంరెడ్డి, మొహన్‌రెడ్డి, శివ, బోడ్ల రాజు, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పాల్గోన్నారు.

బాన్సువాడటౌన్: భారత ఉపప్రధాని బాబు జగ్జీవన్‌రాం 118వ జయంతి వేడుకలను శనివారం బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద గల బాబు జగ్జీవన్ రాం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగ్జీవన్‌రాం మచ్చలేని నాయకుడిగా , విద్యావేత్తగా అందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ జుబేర్ , సాయిబాబా , మోచి గణేశ్ , రమేశ్ , మన్నే సాయిలు , లక్ష్మణ్ , మౌలా తదితరలున్నారు.

బీర్కూర్: మాజీ ఉపప్రధాని, దివంగత బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను శనివారం బీర్కూర్ మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. బాబు జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్ర మంలో నాయకులు సాయిరాం, శ్రీనివాస్, గంగారాం, హన్మండ్లు, వీరేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పెద్ద కొడప్‌గల్: నేటి తరం భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రాం ను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని మండల ఎంపిడివో లక్ష్మీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. బాబు జగ్జీవన్‌రాం జయంతి సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంపిడివో మాట్లాడుతు అతి వయస్సులో మంత్రిగా కావడంతో పాటు వివిధ రంగాలలో బాబు జగ్జీవన్‌రాం రాణించారని గుర్తు చేశారు. దీంతో పాటుగానే భారత రాజ్యాంగ సభలో సభ్యుడిగా పనిచేశారని గుర్తు చేశారు. వ్యవసాయ కుటుంబంలో పుట్టిన జగ్జీవన్ అంచెలవారీగ్ రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించారని తెలిపారు. ప్రజలకు జగ్జీవన్ చేసిన సేవలను గుర్తించిన ప్రజలు అతన్ని బాబుజీ అని పిలిచేవారన్నారు. అంతటి మహనీయ చరిత్ర కలిగిన జగ్జీవన్‌ను నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు నాగిరెడ్డి,పండరి, సంజీవ్, పంచాయితీ కార్యదర్శి శివాజీ తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ:మండల కేంద్రంలో శనివారం జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను మాదిగ కుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. అలాగే కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అనంత్‌రెడ్డి, గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి యాదగిరి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జయంతి స్వాతంత్ర సమర యోధుడు భారతదేశ మాజీ ఉప ప్రధానిగా ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో నర్సింలు, బాలయ్య, రాజలింగం, బిక్షపతి, ధర్మపురి, శివకుమార్, బోలేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూరు: బిక్కనూరు మండలకేంద్రంతో పాటుగా మండలంలోని ఆయాగ్రామాల్లో శనివారం మాజీ ఉప ప్రధాని, స్వాతంత్ర్య సమరయోధుడు బాబు జగ్జీవన్‌రాం జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ఆయాగ్రామాల్లో ప్రజాప్రతినిధులు, అంబెద్కర్ సంఘం, యువజన సంఘాల ఆధ్వర్యంలో జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూలమాలలు వేసి సివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ జగ్జీవన్‌రావ్ సేవలను కోనియాడారు. ఈ కార్యక్రమంలో భిక్కనూరు ఎస్సై ఆంజనేయులు, దళిత సంఘాల నాయకులు లక్ష్మణ్, శంకర్, రాజు, డప్పు రవి, తుడుం ప్రదీప్, ఆయాగ్రామాల నాయకులు, యువజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు

తాడ్వాయి: భారత దేశ మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ 118వ జయంతిని మండల అభివృద్ధి అధికారి కార్యాలయంలో మండల అధికారులు నిర్వహించారు. అతని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బాబు జగ్జీవన్ రామ్ చేసిన స్వాతంత్ర సమర ఉద్యమంలో పాల్గొన్న సందర్భాలను అలాగే ఉప ప్రధానిగా చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఇందులో మండల అభివృద్ధి అధికారి సయ్యద్ సాజిద్ అలీ, మండల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డిటౌన్: జాతి సమగ్రతకు,సమసమాజ స్థాపనకు తన జీవితం ధారపోసిన దేశభక్తుడు, దార్శనికుడు భారత మాజీ ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ అని ఏఎస్పీ నరసింహరెడ్డి అన్నారు. శనివారం ఎస్పీ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. తాను సమాజానికి ఏమి చేయాలనే ఆలోచనను దాటి సమసమాజ స్థాపనకు ఆయన ఒక్కడుగా ముందుకొచ్చారని, అప్పుడు ఆయన చేసిన సంస్కరణలు ఇప్పటికి శిరోధార్యమని అన్నారు. ప్రపంచంలో ఏమి జరుగుతుందనే విషయాలపై కాకుండా దేశంలో ఏమి జరుగుతున్నది చుట్టూ ఉన్న సమాజానికి ఏమి చేయాలని అని నిరంతరం తపనపడ్డారని, అలాంటి దృక్పథం, సంకల్ప బలం నేటి సమాజంలో తప్పనిసరి అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ యాకుబ్‌రెడ్డి, ఎస్‌బీ సీఐ తిరుపయ్య, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్‌లు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

రామారెడ్డి: కామారెడ్డి జిల్లా కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న రామారెడ్డి మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో డాక్టర్ బాబు జగ్జీవన్ రావు జయంతి వేడుకలు శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గొల్లపల్లి లక్ష్మాగౌడ్, బీఆర్ఎస్ నాయకులు లేగల మహిపాల్, బండి శ్రీనివాస్, నాయకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

● మద్దికుంట గ్రామ పంచాయితీలో...

రామారెడ్డి మండలం మద్దికుంట గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద బాబు జగ్జీవన్ రావ్ జయంతి వేడుకలు శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన 118వ జయంతి వేడుకల్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరేష్, బిజెపి గ్రామ అధ్యక్షుడు ముత్యాలరాజు, పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

పెద్ద కొడప్‌గల్, ఏప్రిల్ 05 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాస్లాబాద్ గ్రామంలో శనివా రం సిఎంఆర్‌ఫ్ కింద మంజూరైన చెక్కును బాధితులను కాంగ్రెస్ నాయకులు అందజే శారు. ఈ సందర్భంగా నాయకులు షైమద్ మాట్లాడుతూ..వివిధ కారణాలతో ఆసుపత్రుల లో చికిత్స పొంది ఆర్థికంగా వెనుకబడిన కు టుంబాలకు సిఎంఆర్‌ఫ్ కింద నిధులు మం జూరు కావడంతో లబ్దిదారులకు అందజేయడం జరిగిందని తెలిపారు. పేద ప్రజల సంక్షేమా న్ని గుర్తెరిగిన కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్య సరఫరాను చేపట్టిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అనంత్‌రావ్ దేశాయ్, హన్మగౌడ్, అంబయ్య, నబి పాల్గొన్నారు.

దౌల్తాపూర్‌లో చికెన్ గున్యా

బిచ్కుంద,ఏప్రిల్ 05(ఆంధ్రజ్యోతి): మండలంలోని దౌల్తాపూర్ గ్రామంలో గత కొద్ది రోజులుగా చికెన్ గునియా భారినపడి అనారోగ్యానికి గురయ్యారు. విపరీతమైన దోమల వ్యాప్తి చెంది ప్రజలు అనారోగ్య భారిన పడుతున్న వైద్యఆరోగ్యశాఖ అధికారులు పట్టన్నట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ గ్రామంలో దాదాపుగా 20 మందికి పైగా చికెన్ గునియా భారిన పడి కాళ్లు, చేతులు,కీళ్లనొప్పులతో లేవలేని పరిస్థితుల్లో ఉన్నారు. మరికొందరు వైద్యం కోసం పట్టణాలకు వెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు. మండలంలోని గ్రామాలలో చికెన్ గునియా వ్యాపించకుండా వైద్యఆరోగ్యశాఖ సంబంధిత అధికారులు దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.

బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని కామారెడ్డి ఎమ్మెల్యేకు ఆహ్వానం

రామారెడ్డి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న రామారెడ్డి మండల కేంద్రంలో ప్రసిద్ధిగాంచిన శ్రీ సీతారామచంద్రస్వామి, శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయాల బ్రహ్మోత్సవాల్లో భాగంగా హాజరుకావాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డిని కలిసి హాజరుకావాలని కోరారు. శనివారం ఎమ్మెల్యేకు ఉత్సవాలకు సంబంధించి ఉత్సవాలకు సంబంధించి పత్రాన్ని సమర్పించి హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మెన్ రఘు రవీందర్ గౌడ్, ప్రతినిధులు శంకర్ గౌడ్, కమ్మరి ఈశ్వర్, కుశన్నోల్ల తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా?

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మండలంలోని అన్నాసాగర్ గ్రామంలో ప్రధాన రహదారి పక్కన ఉన్న విద్యుత్ స్తంభం శిథిలా వ్యవస్థలో ఉండడంతో స్తంభం కింది భాగాన ఇనుప చువ్వలు కనిపిస్తున్నాయి. దీంతో విద్యుత్ స్తంభం ఈదురు గాదులకు ఎప్పుడు ప్రమాదం జరుగుతుందో అని గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరిన స్తంభాన్ని తొలగించి కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బైక్‌పై నుంచి పడి ఒకరి మృతి

నసురుల్లాబాద్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): బీర్కూరు మండలం సంబపూర్ గ్రామానికి చెందిన గైక్వాడ్ సంతోష్ శనివారం షైలారం గ్రామ మూలమలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి అక్కడికక్కడే మరణించినట్లు స్థానికులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పని నిమిత్తం షైలారం గ్రామానికి వెళ్తున్న సమయంలో బైక్ అదుపుతప్పి పడి అక్కడికక్కడే మృతి చెందాడని, అతని భార్య సురేఖ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

అక్రమంగా మొరం తవ్విన జేసీబీ, ట్రాక్టర్ సీజ్

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి పట్టణ పరిధిలోని గండి మాసానిపేట్ పరిధిలో అక్రమంగా మొరం తవ్వుతున్నారని సమాచారం మేరకు శుక్రవారం రాత్రి ఎల్లారెడ్డి సిఐ రవీందర్ నాయక్ మొరం తవ్వుతున్న ప్రాంతానికి వెళ్లి అనుమతులు లేకుండా మొరం తవ్వుతున్న జేసీబీ ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్ కు తరలించి సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అనుమ తులు లేకుండా మొరం తవ్వకాలు చేపడితే చట్టం ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

గ్రామాల్లో పార్టీ జెండా ఆవిష్కరించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కామారెడ్డిటౌన్,ఏప్రిల్ 05(ఆంధ్రజ్యోతి): గ్రామగ్రామన బీజేపీ పార్టీ జెండాను ఆవిష్కరించాలని ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు.శుక్రవారం పట్టణంలోని రాజారెడ్డి గార్డెన్స్‌లో ఏర్పాటుచేసిన నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏప్రిల్ 6 న బీజేపీ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు, వార్డులలో పార్టీ జెండా ఆవిష్కరించాలని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి నాయకుడు, కార్యకర్త తప్పక పోటీచేయాలని అన్నారు. ఇప్పటి నుండే ప్రజల్లో ఉంటూ పోటీకి సన్నద్ధం కావాలని సూచించారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చిన కామారెడ్డిలో బీజేపీ అభ్యర్థులు గెలుస్తారని, స్థానిక సంస్థల్లో గెలుపే పార్టీ బలాన్ని నిరుపిస్తుందని అందుకే ప్రతి ఒక్కరు పోటీచేసి గెలిచి ప్రజలకు మరింత పారదర్శకమైన పాలన అందించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు, జిల్లా ప్రధానకార్యదర్శి నరేందర్‌రెడ్డి, విపుల్‌జైన్,నందివేణు,కుంట లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఉచిత బియ్యం పథకం కేంద్రానిది'

లింగంపేట, ఎప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : పేదలు ఇస్తున్న ఉచిత బియ్యం పథకం కేంద్ర ప్రభుత్వానిదని ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన పథకం ద్వారా కేంద్రం ఉచిత బియ్యం పంపిణీ చేస్తుందని బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు క్రాంతి కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రేషన్ దుకాణంలో రేషన్ లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఒక్కో వ్యక్తికి ఆరు కిలోల సన్న బియ్యం పంపిణీ చేస్తే అందులో 5కిలోలు కేంద్రం, 1కేజీ రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుందని వారు తెలియజేశారు. మొత్తం రాష్ట్ర ప్రభుత్వమే ఇస్తున్నట్లుగా ప్రచారం చేసుకుంటుందని రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుంది కేవలం 1కేజీ మాత్రమేనని వారు తెలియజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందని వారు తెలియజేవారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి నవీన్, నాయకులు విష్ణు, బాలయ్య, రజనీకాంత్, అనిల్‌కుమార్, భీమయ్య, సంతోష్‌లతో పాటు డీలర్ రమేష్‌లు ఉన్నారు.

క్యాసంపల్లి బైపాస్ వద్ద కారు దగ్ధం


దగ్ధమైన కారును పరిశీలిస్తున్న పోలీసులు

కామారెడ్డిటౌన్,ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి):దేవునిపల్లి పోలీసుస్టేషన్ పరిధిలోని క్యాసంపల్లి బైపాస్ వద్ద కారు దగ్ధం అయినట్లు దేవునిపల్లి ఎస్ఐ రాజు తెలిపారు.భువనగిరి నుండి బడాపహడ్ దర్గాకు వెళ్తున్న స్కార్పియో వాహ నంలో శనివారం తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో పొగలు రావడం తో ప్రయాణికులు గమనించారు. వెంటనే అందరూ కిందికి దిగి చూడడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో అగ్నిమా పక శాఖకు సమాచారం అందించగా వారు వచ్చి మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో ఎవరికి ఏ ప్రమాదం కల్గలేదని ఎస్ఐ తెలిపారు.

కాలభైరవ స్వామి ఆలయంలో

కామారెడ్డి న్యాయాధికారి ప్రత్యేక పూజలు

రామారెడ్డి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న రామారెడ్డి మండల కేంద్రం - ఇసన్నపల్లి గ్రామాల మధ్య వెలసిన శ్రీ కాలభైరవ స్వామి ఆలయంలో శనివారం కామారెడ్డి జడ్జి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న శ్రీ కాలభైరవ స్వామి ఆలయంలో కామారెడ్డి జిల్లా జడ్జి వరప్రసాద్ దంపతులు, కుమార్తె ,అల్లుడు స్వామివారిని దర్శించుకుని అభిషేకం, ప్రత్యేక పూజలు, సింధూర పూజలు నిర్వహించారు. అనంతరం జడ్జి దంపతులకు శాలువా కప్పి మెమోంటో అందజేసి ఘనంగా సన్మానించారు. అనంతరం ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ బుర్ర ప్రభురాంచంద్రం గుప్తా, జూనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్, పురోహితులు శ్రీనివాస్ శర్మ, సిబ్బంది నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): యువతి అదృశ్యమైన సంఘటన ఎల్లారెడ్డి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ మహేష్ తెలిపిన వివరాల ప్రకారం ఎల్లారెడ్డి మండలంలోని అల్మాజీపూర్ గ్రామానికి చెందిన ఎరుకల మధుమతికి సంవత్సరం క్రితం జంగమయ్యపల్లి గ్రామానికి చెందిన మహేందర్‌తో వివాహం జరిగింది. వారిద్దరి మధ్య గొడవల కారణంగా గత నాలుగు నెలల నుంచి మధుమతి అల్మాజీపూర్ గ్రామం నందు తన అమ్మగారి ఇంటి వద్దనే ఉంటుంది. ఈనెల నాలుగో తారీఖు నాడు మధుమతి, ఆమె అమ్మ అయిన సుగుణ ఆమె తమ్ముడు అందరూ కలిసి తిని రాత్రి 10 గంటలకు పడుకున్నారని డ్యూటీకి వెళ్లిన మధుమతి తండ్రి అయిన పోచయ్య అర్ధరాత్రి 12 గంటలకు ఇంటికి వచ్చినప్పుడు మేల్కొని చూడగా మధుమతి ఇంట్లో కనిపించలేదు అని తనకోసం చుట్టుపక్కల తెలిసిన వారి వద్ద వెతకగా తన ఆచూకీ దొరకకపోవడంతో మధుమతి తండ్రి అయిన పోచయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

భార్య పై కర్రతో దాడి చేసిన

భర్త పై కేసు నమోదు

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): భార్యపై కర్రతో దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎల్లారెడ్డి ఎస్ఐ మహేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని లింగారెడ్డి పేట్ అర్జునవాడకు చెందిన రామగర్ల లావణ్యకు ఏడు సంవత్సరాల క్రితం రామగర్ల శేఖర్‌తో వివాహం జరిగింది. గత కొన్ని రోజుల నుండి శేఖర్ మద్యానికి బానిసై ఇంట్లో తనను, తన పిల్లలని పట్టించుకోకుండా లావణ్యను వేధిస్తున్నాడని ఇట్టి బాధ భరించలేక లావణ్య శేఖర్ మామ అయిన శివానంద్‌కు చెప్పి బాధపడగా ఈ నెల 4వ తేదిన గాంధీ చౌక్ వద్ద శివానంద్, లావణ్య ఇద్దరు కలిసి అక్కడ ఉన్న శేఖర్ తో మాట్లాడి సర్ది చెబుదామని వెళ్లగా శివానంద్ శేఖర్‌ను సముదాయిస్తుండగా వినకుండా లావణ్యను శేఖర్ కట్టెతో కొట్టి తలపై గాయపరిచినాడని లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.



సినిమా గైడ్ కామారెడ్డి

కామారెడ్డి

దర్పన్	- రాబిన్ హుడ్
ప్రియా 70	- స్టేట్ వర్సెస్ నోబడి
ప్రియా 35	- శారీ

బాన్సువాడ

మహేశ్వరి	- మ్యాడ్ స్కేర్
వెంకటేశ్వర	- ధీర వీర శూర



చికెన్ ధరలు

రకం		లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	110	150	180
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

